



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.

సంచిక : 273 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | 22-1-2026 పేజీలు-8 | వెల: రూ. 5.00

## తెలంగాణలో వైద్యవిద్యకు పెద్దపీట

- అన్ని వర్గాల సంక్షేమమే మా లక్ష్యం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**జగిత్యాల, - జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణలో విద్య, వైద్యం, అన్ని వర్గాల సంక్షేమంతోపాటు అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలో బుధవారం రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవనం, రూ.10 కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం, రూ.17 కోట్లతో వాటర్ ప్లాంటు నిర్మాణం, రూ.2 కోట్ల అంచనా వ్యయంతో ఎస్సీ బాలుర వసతిగృహ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. -మిగతా 2 లో

## దేశంలో 26-26 ఉగ్ర కుట్రకు ప్లాన్..

- నిఘా వర్గాలు అప్రమత్తం
- గణతంత్ర దినోత్సవ వేళ ఉగ్రదాడులకు ప్లాన్
- హెచ్చరించిన నిఘా వర్గాలు



**న్యూఢిల్లీ, -** గణతంత్ర దినోత్సవాన్ని లక్ష్యంగా చేసుకుని భారత్‌లో ఉగ్రదాడులు జరిగే అవకాశాలున్నాయని నిఘా వర్గాల తాజా సమాచారం. ఈ సమాచారంతో ఢిల్లీలో భద్రతా బలగాలు బుధవారంనాడు అప్రమత్తమయ్యాయి. పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ ఈ ఉగ్రదాడులకు సహకరించనున్నట్టు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. జనవరి 26న దేశంలోని పలు ప్రాంతాల్లో జరిపే ఈ దాడులకు '26-26' అనే కోడ్ నేమ్ పెట్టినట్టు తెలిపాయి. దేశంలోని పలు ఆలయాలు, నగరాలతో పాటు అయోధ్యలోని రామాలయం, -మిగతా2లో

# మరో ₹12,500 కోట్లు

**తెలంగాణలో రష్మీ గ్రూప్ పెట్టుబడి**


**రాష్ట్రంలో 12 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్ష ఉద్యోగాలు కల్పించే అవకాశం**

## వరల్డ్ ఎననామిక్ ఫోరం ఫాలోఅప్ సదస్సును ఏటా నిర్వహించాలి

- వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్‌లో సీఎం రేవంత్ ప్రతిపాదన
- వివిధ సంస్థలతో చర్చలు..ఒప్పందం
- వేయికోట్ల పెట్టుబడులకు సర్గడ్ సంస్థతో ఒప్పందం
- హైదరాబాద్‌లో రీసెర్చ్ సంస్థ ఏర్పాటుకు బ్లైజ్ అంగీకారం
- రష్మీ గ్రూప్ 12500 కోట్లతో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు

**హైదరాబాద్ జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వరల్డ్ ఎననామిక్ ఫోరం ఫాలోఅప్ సదస్సును ఏటా నిర్వహించాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. దావోస్‌లో జరుగుతున్న సదస్సులో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. ప్రతి సంవత్సరం జులైలో హైదరాబాద్‌లో దీన్ని నిర్వహించాలని కోరారు. సీఎం ప్రతిపాదనకు గ్లోబల్ బిజినెస్ లీడర్లు, పాలసీ నిర్ణేతలు మద్దతు తెలిపారు. ఇదిలావుంటే వివిధ కంపెనీల ప్రతినిధులతో భేటీ అయిన సిఎం రేవంత్ పలు రంగాల్లో పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు కుదుర్చుకున్నారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ -మిగతా 2 లో





## మేడారంలో జాతర సందడి

- భారీగా తరలి వస్తున్న భక్త జనం
- ఘనంగా మండమెలిగె పండగ నిర్వహణ
- గద్దెల వద్ద పూజారులు ప్రత్యేక పూజలు

**ములుగు - జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మేడారం సమ్మక్క సారలమ్మ దేవతల మండ మెలిగే పండుగను పూజారులు - అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారంఉదయాన్నే మేడారం సమ్మక్క దేవత పూజరులు సిద్దబోయిన, కొక్కెర, మ్లలెల, వంశీయులు, నె రాలమ్మ పూజారులు కాక వంశీయులు వారి వారి ఇళ్లను శుభ్రం చేసుకున్నారు. అనంతరం పిల్లాపాపలతో సహా పవిత్ర స్నానాలు చేశారు. సమ్మక్క పూజారులు మేడారం గుడికి సారల మ్మపూజారులు కన్నెపెల్లి గుడికి వెళ్లి గుడులను పవిత్ర గోదావరి జలంతో శుద్ధి చేశారు. అనంతరం సమ్మక్క -మిగతా 2 లో

# మున్సిపల్ ఎన్నికలకు మేం సిద్ధం

## స్థానిక సమస్యల ఆధారంగానే ప్రజల తీర్పు



- కాంగ్రెస్‌కు ఓటేస్తే జిల్లాలు ఎత్తేయడం ఖాయం
- పంచాయతీ ఎన్నికల్లో 40 శాతం సర్పంచులను గెలిచాం
- మున్సిపల్ ఎన్నికల్లో కూడా మెజారిటీ సీట్లు గెలుస్తాం
- బస్తీబాట కార్యక్రమంతో క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకుంటున్నాం
- మీడియాతో బీఆర్ఎస్ నేత కేటీఆర్

**హైదరాబాద్, జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మున్సిపల్ ఎన్నికలకు బీఆర్ఎస్ పార్టీ సిద్ధంగా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే జిల్లాలు ఎత్తివేయటం ఖాయమని కేటీఆర్ హెచ్చరించారు. స్థానిక సమస్యల ఆధారంగానే మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేస్తారని.. ఫార్ములా ఈ, ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు ఆధారాలు చూపలేకపోయారని అన్నారు. ఫార్ములా ఈ కేసులో దోషులుగా చెప్తోన్న గ్రీన్ కోతో దావోస్‌లో రేవంత్ -మిగతా 2 లో




## 27 ఏళ్ల అంతరిక్ష ప్రయాణానికి గుడ్‌బై..

- రిటైర్మెంట్ ప్రకటించిన సునీతా విలియమ్స్
- సునీతా విలియమ్స్ 1998లో నాసాకు ఎంపిక
- అత్యధిక రోజులు స్పేస్‌లో గడిపిన అమెరికన్ల జాబితాలో ఆరో స్థానం

**న్యూఢిల్లీ, -** భారత సంతతికి చెందిన ప్రముఖ నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్(60) కీలక నిర్ణయం తీసుకున్నారు. తన 27 ఏళ్ల సుదీర్ఘ అంతరిక్ష ప్రయాణానికి వీడ్కోలు పలికారు. నాసా నుంచి రిటైర్ అవుతున్నట్లుగా ప్రకటించారు. గత ఏడాది డిసెంబర్ 25వ తేదీ నుంచే ఇది అమలులోకి వచ్చిందని నాసా పేర్కొంది. " మానవ అంతరిక్ష ప్రయాణంలో సునీతా విలియమ్స్ మార్గదర్శకురాలు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఆమె చూపిన నాయకత్వం, టెక్నాలజీ అభివృద్ధికి చేసిన సేవలు చంద్రుడు, మార్స్‌పై భవిష్యత్తులో చేయబోయే మిషన్లకు బలమైన పునాది వేశాయి." అని నాసా అడ్మినిస్ట్రేటర్ జారెడ్ ఐజాక్‌మన్ ఈ సందర్భంగా ప్రశంసించారు.సునీతా విలియమ్స్ 1998లో నాసాకు ఎంపికయ్యారు. 27 ఏళ్ల పాటు అమెరికా అంతరిక్ష కేంద్రంలో ఆమె పనిచేశారు. మొత్తం మూడు మిషన్లలో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లారు. మొత్తం 608 రోజులు అంతరిక్షంలో గడిపి, -మిగతా 2 లో

## మున్సిపల్ ఎన్నికలకు జాగృతి దూరం

- ఎవరు కోరినా మద్దతు ఇస్తాం
- ఫోన్ ట్యాపింగ్ తుదిదశకు చేరుతుందన్న నమ్మకం లేదు
- మీడియాతో జాగృతి అధ్యక్షురాలు కవిత



**హైదరాబాద్, జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జాగృతి ఇంకా పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా మారలేదని.. అందుకే ఈ ఎన్నికల్లో పోటీ చేయడం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత స్పష్టం చేశారు. త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలపై కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఉద్యమకారుడు ముచ్చర్ల సత్యనారాయణ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కవిత మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో ఎవరు మద్దతు కోరినా ఇస్తామని కవిత తెలిపారు. -మిగతా 2 లో

## నాకేదైనా జరిగితే ఇరాన్ ఔట్

- తనపై ఇరాన్ హత్యకు పాల్పడితే.. ఆ దేశాన్ని అమెరికా భూస్థాపితం చేస్తుంది
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

**వాషింగ్టన్, -** ఇరాన్‌ను ఉద్దేశించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తనపై ఇరాన్ హత్యకు పాల్పడితే.. ఆ దేశాన్ని అమెరికా భూస్థాపితం చేస్తుందని వార్నింగ్ ఇచ్చారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలో ఓ మీడియా సంస్థ ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. తనపై ఏదైనా హత్యాయత్నం జరిగి, దాని వెనక ఇరాన్ హస్తం ఉందని తేలితే.. ఆ దేశాన్ని తుడిచిపెట్టేయాలని తన సలహాదారులను ఆదేశించినట్లు ట్రంప్ ఇప్పటికే ఓసారి వ్యాఖ్యలు చేశారు. తాజాగా మరోసారి అదేతరహా హెచ్చరికలు చేశారు. కాగా.. డిసెంబర్ నుంచి పాలకులకు వ్యతిరేకంగా ఇరాన్ ప్రజలు నిరసనలు చేపడుతున్నారు. దీంతో తమ దేశంలో నెలకొన్న



-మిగతా 2 లో

## రాముడి పేరు చెప్పకుండా ఎన్నికల్లో నిలబడగలరా

- నిజామాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



**నిజామాబాద్,- జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శ్రీరాముడి పేరు చెప్పకుండా ఎన్నికల్లో నిలబడే దమ్ము బీజేపీకి ఉందా అని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. నిజామాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని.. కాంగ్రెస్ తోనే నిజామాబాద్ అభివృద్ధి సాధ్యమని అన్నారు బుధవారం నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో నిర్వహించిన ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ బీజేపీపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ నాయకుల -మిగతా 2 లో

# తెలంగాణలో వైద్యవిద్యకు పెద్దపీట

మొదటి తరువాయి



అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. 'జిల్లాలో ఇంటిగ్రేటెడ్ మోడల్ పాఠశాల నిర్మాణానికి రూ.200 కోట్లు కేటాయించాం. ఒకే ప్రాంగణంలో విద్య, ఆటలు, హాస్టల్, ల్యాబ్స్, డైనింగ్, క్రీడలు అన్నీ ఉండేలా ప్రణాళిక రూపొందించాం. పేద కుటుంబాల పిల్లలకు మంచి అవకాశాలు ఇస్తే వారు సమాజంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని మేం నమ్ముతున్నాం. వెనుకబడిన వర్గాలు చదువులు, ఉద్యోగాల్లో, సమాజ నిర్మాణంలో ముందుకు రావాలంటే ప్రభుత్వం తరఫున చేయాల్సిన కృషి చేస్తున్నాం. అభివృద్ధి అంటే కేవలం భవనాల నిర్మాణం కాదు, ప్రజల జీవితాల్లో మార్పు రావడం. ఎన్నికల సమయంలో చేసిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం. పారదర్శకత, నిబద్ధత, సంకల్పంతో ముందుకు సాగుతున్నాం' అని భట్టి అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

### దేశంలో 26-26

# ఉగ్ర కుట్రకు ప్లాన్..

మొదటి తరువాయి

జమ్మూలోని రఘునాథ్ ఆలయం ఉగ్రవాదుల టా÷-గ్గ÷ట్‌లో ఉన్నట్టు భద్రతా బలగాలు తెలిపాయి. పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్, పంజాబ్ బేస్డ్ గ్యాంగ్‌స్టర్లతో ఐఎస్ఐ ఈ ఉగ్రదాడులకుచేస్తున్నట్టు పేర్కొన్నాయి. గత నవంబర్‌లో ఎర్రకోట వెలుపల జరిగిన కారుబాంబు పేలుడు ఘటన వెనుక జైషే మహ్మద్ ఉంది. కాగా, నిఘా వర్గాల సమాచారంతో అప్రమత్తమైన అధికారులు జమ్మూకశ్మీర్, ఢిల్లీ, పంజాబ్ వంటి కీలక ప్రాంతాల్లో భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేశారు. అనుమానితుల పోస్టర్లను ఢిల్లీలో పలు చోట్ల ఏర్పాటు చేశారు. ప్రధానంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాల్లో వీటిని ఉంచారు.గత ఏడాది ఏప్రిల్‌లో లష్కరే తొయిబా ఉగ్రసంస్థ పహల్గాంలో జరిపిన ఉగ్రదాడిలో 26 మంది టూరిస్టులు ప్రాణాలు కోల్పోయారు. గత వారం లష్కరే సంస్థ జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదానికి కట్టుబడి ఉన్నామని బహిరంగంగా ప్రకటించింది. హిందువులకు వ్యతిరేకంగా లష్కరే కమాండర్ విద్వేషపూరిత ప్రసంగం చేశాడు. హిందువుల కుత్తుకలు కోసినప్పుడే 'ఫ్రీడం' సాధ్యమని పీఓకేలో జరిగిన ఒక కార్యక్రమంలో అబూ మూసా కశ్మీరీ చేసిన ప్రసంగం వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. పహల్గాం ఉగ్రదాడికి ముందు కూడా కశ్మీరీ ఇలాంటి వ్యాఖ్యలే చేశాడు. దీంతో భారత్‌పై దాడులకు మరింత భారీ కుట్ర చేసే అవకాశాలు ఉండవచ్చని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి.

# 27 ఏళ్ల అంతరిక్ష ప్రయాణానికి గుడ్‌బై..

మొదటి తరువాయి

అత్యధిక రోజులు స్పేస్‌లో గడిపిన అమెరికన్ల జాబితాలో ఆరో స్థానంలో నిలిచారు. బుచ్ విల్‌మోర్‌తో కలిసి 286 రోజులు అంతరిక్షంలో ఉన్నారు. మొత్తం తొమ్మిదిసార్లు స్పేస్ వాక్ చేశారు. స్పేస్ వాక్ కోసం 62 గంటల 6 నిమిషాలు గడిపారు. మహిళా వ్యోమగాముల్లో ఇదే అత్యధికం. అంతరిక్షంలోనే మారథాన్ చేసిన తొలి వ్యక్తిగానూ సునీతా విలియమ్స్ చరిత్ర సృష్టించారు.

సునీతా విలియమ్స్ మూడు మిషన్లు

2006 డిసెంబర్ 9

స్పేస్ షటిల్ డిస్కవరీ ద్వారా అంతరిక్షంలోకి తొలి ప్రయాణం చేశారు. ఎక్స్‌పిడిషన్ 14/15లో ఫ్లైట్ ఇంజినీర్‌గా పనిచేసి నాలుగు స్పేస్ వాక్‌లు చేశారు.

2012 జూలై 14

కజకిస్తాన్‌లోని బయ్‌కోనూర్ నుంచి రెండోసారి అంతరిక్షంలోకి వెళ్లారు. 127 రోజుల పాటు ఎక్స్‌పిడిషన్ 32/33లో సేవలందించారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో అమ్మోనియా లీక్ మరమ్మతులు సహా కీలక పనులు చేశారు.

2024 జూన్

బోయింగ్ స్టార్‌లైనర్ ద్వారా 2024 జూన్‌లో సునీతా విలియమ్స్ మూడోసారి అంతరిక్షంలోకి వెళ్లారు. ఎక్స్‌పిడిషన్ 71/72లో భాగంగా 286 రోజులు అంతరిక్షంలో గడిపి 2025 మార్చిలో భూమిపైకి తిరిగొచ్చారు.

# మేడారంలో జాతర సందడి

మొదటి తరువాయి

పూజారి ఆయన సిద్ధబో యిన నితిన్, సారలమ్మ పూజారి అయిన కాక సారయ్య ఇండ్ల వద్ద డోలు వాయిద్యాల నడుమ మామిడాకు తోరణాలను కట్టారు. అక్కడినుండి పూజారులు ఆడపడుచులు (ఆడబిడ్డలు) పూజా సామగ్రితో మంగళ హారతులతో ఆయా గుడులకు చేరుకున్నారు. ఆడబిడ్డలు అడవి నుంచి తెచ్చిన పుట్ట మన్నుతో గుడులను అలికి ముగ్గులు వేశారు. అనంతరం పూజారులు డోలు వాయిద్యాల నడుమ బొడ్రాయి, ముత్యా లమ్మ, భూలక్ష్మి, మహాలక్ష్మి లకు నూతన వస్త్రా లు పెట్టి పసుపు కుంకుమ పెట్టి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. అక్కడ నుంచి నేరుగా ఆలయం ముందు బురికా స్తంభాలతో తోరణా నికి చీడపీడలు రాకుండా కోడిపిల్ల, సొరకాయ, మిరపకాయ, మామిడి, వేప మండలు కట్టి తోరణం కట్టారు. అనంతరం గ్రామ పొలిమే రలల్లో బూరిక చెట్లతో తోరణాలు కట్టారు. సాయంత్రం డోలు వాయిద్యాల నడుమ గద్దెల వద్దకు చేరుకొని రహస్య పూజలు చేశారు. దీంతో మహాజాతరకు అంతా సిద్ధమ ని పూజారులు తెలిపారు. ఇదిలావుంటే గత వారం రోజులుగా భక్తుల పెద్ద ఎత్తున పోటెత్తారు. భారీగా తరలి వస్తున్నారు. దీంతో పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

# మరో 12,500 కోట్లు

మొదటి తరువాయి

2026 సదస్సు సందర్భంగా అమెరికాకు చెందిన సర్గడ్ సంస్థతో తెలంగాణ ప్రభుత్వం కీలక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ప్రపంచ ఆర్థిక సదస్సులో సీఎం రేవంత్ రెడ్డితో ఆ సంస్థ సీఈఓ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్‌హాల్ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థ ముందుకు వచ్చింది. రాబోయే 3 నుంచి 5 సంవత్సరాల్లో రూ.1,000 కోట్ల పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఎమ్ఆర్ఓ కేంద్రాన్ని వరంగల్ లేదా ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. దీంతో రాష్ట్రం.. విమానయాన, ఏరోస్పేస్ రంగాల్లో మరింత బలోపేతమయ్యే అవకాశం ఉంది. అలాగే.. కాలిఫోర్నియా కేంద్రంగా ఉన్న బ్లైజ్ కంపెనీతో మరో ఎంవోయూ కుదిరింది. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వేదికపై సీఎం రేవంత్ రెడ్డితో సీఈఓ దినాకర్ మునగాలా సమావేశమయ్యారు. హెల్త్‌కేర్, మాన్యుఫ్యాక్చరింగ్, ఎఐ ఎనర్జీ రంగాల్లో పైలట్ ప్రాజెక్టులపై చర్చలు జరిగాయి. తక్కువ విద్యుత్ వినియోగంతో ఎఐహార్డ్‌వేర్, ఫుల్-స్టాక్ సాఫ్ట్‌వేర్



అభివృద్ధిలో బ్లైజ్ సంస్థ అగ్రగామి. ఈ ఒప్పందం ద్వారా హైదరాబాద్‌లో రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెంటర్ విస్తరణకు బ్లైజ్ నిర్ణయం తీసుకుంది. ఈ ఒప్పందంతో తెలంగాణలో ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్, ఎఐ రంగాలకు ఊపిరి లభించనుంది. తెలంగాణను ఎఐ డేటా సెంటర్ హబ్‌గా మార్చడమే లక్ష్యమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఎఐ ఇన్నోవేషన్ హబ్ ప్రారంభంకానుందని మంత్రి శ్రీధర్ బాబు ప్రకటించారు. అంతేకాకుండా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' బృందం రష్మి గ్రూప్‌తో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన భారీ ఎంవోయూ కుదుర్చుకుంది. తెలంగాణలో రష్మి గ్రూప్ ఆధునిక స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. దీనికి సుమారు 12,500 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రంలో 12 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్ష ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉంది. డ్టకైల్ ఐరన్ పైపుల తయారీలో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన రష్మి గ్రూప్... ఆసియా, యూరప్, ఆఫ్రికా, అమెరికా దేశాల్లో విస్తృత కార్యకలాపాలు నిర్వహిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు అవసరమైన అన్ని అనుమతులు, బొగ్గు లింకేజీలు అందిస్తామని హామీ ఇచ్చింది. గ్రీన్ మాన్యుఫ్యాక్చరింగ్, సర్క్యులర్ ఎకానమీ విధానాలపై కూడా భాగస్వామ్య చర్చలు జరిగాయి. కాగా.. సీఎం రేవంత్.. జనవరి 20 నుంచి 23 వరకు దావోస్‌లోని డబ్ల్యూఈఎఫ్ 2026 సదస్సులో

# మున్సిపల్ ఎన్నికలకు మేం సిద్ధం

మొదటి తరువాయి

చర్చలు జరుపుతున్నారని అన్నారు . మున్సిపల్ ఎన్నికల్లో కేసీఆర్, నేను ప్రచారం చేసేదేమీ ఉండదని.. సర్పంచ్ ఎన్నికల్లో ముఖ్యమంత్రి ప్రచారం చేసినా కాంగ్రెస్ సాధించింది ఏమీ లేదని అన్నారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో చిట్‌చాట్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల్లో 40 శాతం సర్పంచులను గెలిచామని.. మున్సిపల్ ఎన్నికల్లో కూడా మెజారిటీ సీట్లు గెలుస్తామని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత జీహెచ్ఎంసీ ఎన్నికలు జరుగుతాయి. జిల్లా పరిషత్ ఎన్నికలు పెట్టే అలోచనలో ప్రభుత్వం లేదు. జీహెచ్ఎంసీ ఎన్నికల తర్వాత అసెంబ్లీ ఎన్నికలేనన్నారు. మున్సిపల్ ఎన్నికలకు అన్ని రకాల ఏర్పాట్లు చేసుకున్నామని.. శివరాత్రి లోపలే మున్సిపల్ ఎన్నికలు ముగిస్తారని కేటీఆర్ పేర్కొన్నారు. బస్తీబాట కార్యక్రమంతో క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకుంటున్నాం. పదేళ్లలో మేము చేసినవి.. కాంగ్రెస్ రెండేళ్లుగా చేయనివి గుర్తు చేస్తున్నామని కేటీఆర్ తెలిపారు. సర్వేలు, అభ్యర్థి బలాలు ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. ఎన్నికల్లో జనసేన సహా ఎవరైనా పోటీ చేయొచ్చు. క్షేత్రస్థాయిలో బలముంటే తప్ప.. స్థానిక ఎన్నికల్లో గెలవటం ఈజీ కాదు. జిల్లాలను ఎత్తేసే ప్రయత్నం జరుగుతుంది. జనగాం, నారాయణ పేట, వనపర్తి, సిద్దిపేట, సిరిసిల్ల, నిర్మల్, మంచిర్యాల జిల్లాలను ఎత్తేస్తారనే ఆందోళన ఉంది .జిల్లాలు ఉండాలా.. పోవాలా..? అనేది మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలే నిర్ణయిస్తారు. బొగ్గు కుంభకోణంపై సీబీఐ విచారణ కోరే దమ్ముందా..? రేవంత్ రెడ్డి చేస్తోన్న తుగ్లగ్ పనులతో జంట నగరాల అస్థిత్వం దెబ్బ తింటుంది . సినిమా టిక్కెట్లు పెంచేది



లేదని యూ టర్న్ తీసుకున్నారు. మున్సిపాలిటీల వారీగా బీఆర్ఎస్ ఇంచార్జ్‌లు నియమిస్తున్నాం. మున్సిపల్ ఎన్నికల కోసం ప్రతీ ఉమ్మడి జిల్లాకు ఇంచార్జ్ నియమించామని.. 8 ఉమ్మడి జిల్లాల సన్నాహక సమావేశాలు పూర్తి చేశామని పేర్కొన్నారు. జిల్లాల తొలగిస్తారని ప్రచారం జరుగుతుంది. దీనితో చాలా చోట్ల ప్రజల్లో ఆందోళన ఉన్నదని కేటీఆర్ అన్నారు. కొత్త జిల్లాలు చేసిన పట్టణాల్లో జిల్లాలు ఎత్తేసారు అనే భావనలో ఉన్నారు. ప్రజలు అంతా కూడా ఆందోళనలో ఉన్నారు. జిల్లాల అంశాన్ని ప్రధాన అస్త్రంగా మున్సిపల్ ఎన్నికలలో ప్రచారం చేస్తామన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఎన్నికల కో ఆర్డినేటర్లను పెడుతున్నాం.స్థానిక నాయకులు ఎవరికి టికెట్ ఇవ్వాలని డిసైడ్ చేస్తారు.ఎన్నికలు లేని నాయకులు, ఎమ్మెల్యేలను మున్సిపల్ ఎన్నికల దగ్గర ఇంచార్జ్ లుగా నియమిస్తాం.లోకల్ ఎన్నికలు కాబట్టి లోకల్ వాళ్లే ప్రచారం చేస్తారు.స్థానికత ఆధారంగా ప్రచారం నిర్వహించనున్నట్టు కేటీఆర్ వెల్లడించారు.స్థానిక సమస్యలను ఎజెండాగా ముందుకు తీసుకొని ముందుకు వెళ్తాం. ముఖ్యమంత్రి హార్వర్డ్ వెళ్లి మంచిగా తిరిగి వస్తారు అనుకుంటున్నా. పఠాన్ చెరువు ఎమ్మెల్యే కూడా మా బీఆర్ఎస్ పార్టీనే గెలిపించాలి అంటున్నారు. మేము కూడా అదే అంటున్నామని కేటీఆర్ స్పష్టం చేశారు.పార్టీ మారిన తర్వాత ఆయా నియోజకవర్గాలలో వారికి వ్యతిరేకంగా వీరోచితంగా పోరాటం చేస్తున్నారు.సింగరేణిపై మంత్రులు మాట్లాడడం లేదు. సింగరేణిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి.ఒక్క వైపు ఫార్ములా ఈ అంటాడు. అందులో ప్రూవ్ చెయ్యి.ఇక్కడ ఫార్ములా ఈపై విచారణ అంటాడు. అక్కడ దావోస్‌లో గ్రీన్ కోతో చర్చలు జరుపుతున్నారు.

ఒక్క దగ్గర మంచోళ్ళు అవుతారు. మరో దగ్గర చెడ్డోళు అవుతారు ఎలా..? హైద్రాబాద్ కార్పొరేషన్ ఒక్కటే ఉండే మేమేం మార్చలేదు. రేవంత్ రెడ్డి జవాబు చెప్పాలి. రేవంత్ రెడ్డి తుగ్లక్, సమాధానం చెప్పే వరకు ఆయన వెంబడి పడుతాం అన్నారు. రేవంత్‌లో రాము ఉన్నాడు.. రెమో ఉన్నాడని కేటీఆర్ అన్నారు. ఉదాహరణకు సినిమా టికెట్లు పెంచం అంటాడు , మరోవైపు సినిమా టికెట్లు పెంచుతూ జీవో ఇస్తారు. సర్వాయి పాపన్న పేరు మీద జనగామ జిల్లా చేస్తాం అన్నారు కానీ ఇప్పుడు మళ్ళీ అదే జిల్లాను తొలగిస్తాం అన్నారు. అందుకే ఆయన రాము రెమో అని అన్నానని చెప్పుకొచ్చారు కేటీఆర్.

# రాముడి పేరు చెప్పకుండా ఎన్నికల్లో నిలబడగలరా

మొదటి తరువాయి

తప్పిదాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయని.. వాటిపై నోటీసులు ఇస్తే బాధ ఎందుకని అన్నారు.సింగరేణి విషయంలో పస లేని ఆరోపణలు చేస్తున్నారని.. సింగరేణి కాంట్రాక్టులు బీఆర్ఎస్ హయాంలో జరిగినవి అని అన్నారు. ఆరోపణలపై ఆధారాలు ఉంటే చర్చకు సిద్ధంగా ఉన్నామని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ హయాంలో 20 శాతం ఎక్సెస్ టెండర్లు జరిగాయని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినాక అన్ని శాఖలను ప్రక్షాళన చేశామని.. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో జరిగిన లోపాలను సరిదిద్దుతున్నామని అన్నారు. కేటిఆర్, హరీష్ రావులు బట్ట గాల్చి మీద వేసే ప్రయత్నం చేస్తున్నారని.. ఎన్నికల లబ్ధికోసం నోటీసులు ఇస్తున్నారనేది సమంజసం కాదని అన్నారు.ఫోన్ ట్యాపింగ్ అనేది అత్యంత నేరం..అలాంటి నేరం బీఆర్ఎస్ నాయకులు చేసారని.. సినీ నిర్మాత తారలు,స్వంత పార్టీ ఎమ్మెలేల ఫోన్ లు కూడా ట్యాప్ చేసారని అన్నారు మహేష్ కుమార్ గౌడ్. సిట్ విచారణలో రాజకీయ కక్ష కోణం ఎక్కడా లేదని.. నిజంగా తప్పు చేయకుంటే వివరణ ఇచ్చే ప్రయత్నం చేయాలని అన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో కాంగ్రెస్ ఇచ్చిన సింగరేణి కాంట్రాక్టులు, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన టెండర్లపై చర్చకు రావాలని అన్నారు మహేష్ కుమార్ గౌడ్. సిఎం బంధువు సృజన్ రెడ్డిపై ఆరోపణలు చేసి దెబ్బ తీయాలనే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.

# నాకేదైనా జరిగితే ..ఇరాన్ ఔట్

మొదటి తరువాయి

ఆందోళనలకు అమెరికా అధ్యక్షుడే కారణమని ఆయతుల్లా అలీ ఖమేనీ ఆరోపించగా.. ఇరాన్‌లో కొత్త నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని ఆ నిరసనకారులకు ట్రంప్ మద్దతు పలుకుతున్న సంగతి తెలిసిందే. సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఖమేనీ పాలన అంతం కావాలని పిలుపునిచ్చారు. ఈ వ్యాఖ్యలపై ఇరాన్ (ఎసజీని) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తమ నాయకుడే లక్ష్యంగా ఏదైనా దురాక్రమణ జరిగితే.. దానిని తాము దీటుగా ఎదుర్కొంటామని హెచ్చరించింది. ఇక ఈ నిరసనల్లో 5వేల మంది మృతి చెందినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. 26వేల మంది వరకు అరెస్టయినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. ఈ మరణాలకు అమెరికానే కారణమని ఖమేనీ నిందించారు.

### మున్సిపల్ ఎన్నికలకు

# జాగృతి దూరం

మొదటి తరువాయి

అవసరమైన చోట తనతో పాటు జాగృతి నేతలు ప్రచారం చేస్తారని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కేసు తుదిదశకు చేరుతుందనే నమ్మకం తనకు లేదన్నారు. తనలాంటి బాధితులకు న్యాయం జరిగే అవకాశం లేదని చెప్పారు. కావాలనే హరీశ్‌రావుకు సిట్ నోటీసులు ఇచ్చి డైవర్షన్ చేస్తున్నారన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి కీలక వ్యాఖ్యలు చేశారు. గుంపు మేస్త్రీ, గుంట నక్క కలిసే ఉన్నారంటూ విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ పేరుతో డ్రామా మొదలుపెట్టారని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల సమయంలోనే ఎందుకు విచారణ చేపట్టారని ఆమె ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ ఇప్పట్లో తుది దశకు చేరుతుందని తాను అనుకోవడంలేదని ఆమె చెప్పారు. విచారణ వల్ల తనలాంటి బాధితులకు న్యాయం జరుగుతుందని భావించటంలేదని కవిత అన్నారు. పొలిటికల్ పవర్ బలహీన వర్గాలకు వచ్చినప్పుడే ఆ సమాజం బాగుపడుతుందన్నారు. చాలామంది ఎన్నికల్లో పోటీచేస్తామని అడుగుతున్నారని.. కానీ జాగృతి పూర్తిస్థాయి రాజకీయ పార్టీ కాలేదని వెల్లడించారు. యువత, మహిళలు ఎక్కడ పోటీచేసినా జాగృతి మద్దతిస్తుందని ఆమె స్పష్టం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు బీసీలను మభ్యపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం వాటా ఇవ్వకుండానే ప్రభుత్వం ఎన్నికలకు వెళుతోందని విమర్శించారు. జిల్లాల పునర్విభజన ఎప్పుడు జరిగినా సికింద్రాబాద్‌ను జిల్లా చేయాల్సిందేనని కవిత డిమాండ్ చేశారు. పీవీ.నరసింహారావు పేరు ఏదో ఒక జిల్లాకు పెట్టాలని కూడా కవిత కోరారు.కొత్త జిల్లాల ఏర్పాటుతో ఉద్యోగులు, యువతకు నష్టం జరిగిందని కవిత విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఐదు శాతం ఓపెన్ కోటాను నాన్ లోకల్‌గా మార్చడంతో రాష్ట్ర యువతకు నష్టం జరుగుతోందని తెలిపారు. జాగృతి తరఫున అధ్యయనం చేస్తున్నామని.. జిల్లాల పునర్విభజన కమిషన్ ఏర్పాటు చేస్తే నివేదిక ఇస్తామని తెలిపారు. కొత్త పార్టీ ఏర్పాటు కసరత్తు వేగంగా జరుగుతోందని.. జీహెచ్ఎంసీ ఎన్నికల నాటికి పక్రియ పూర్తవుతుందో లేదో చూడాలని కవిత అన్నారు. ఎన్నికల కమిషన్ వద్ద కూడా అడ్డంకులు సృష్టించే అవకాశం లేకపోలేదని తెలిపారు. పార్టీకి ఇంకా ఏ పేరు అనుకోలేదని.. తెలంగాణ రాష్ట్ర జాగృతి సమితి అని కొందరు సూచించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ అంశానికి కూడా న్యాయం చేస్తారన్న నమ్మకం తనకు లేదని అన్నారు. నైని బొగ్గు గని అంశం కంటే సింగరేణికి కొత్త బొగ్గు గనులు వచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో సైట్ విజిటింగ్ సర్టిఫికెట్ విధానం ఎప్పటి నుంచో ఉందని.. కాంగ్రెస్ వచ్చిన తర్వాత దాన్ని ప్రధాన నిబంధనగా పెట్టారని.. కొంత మందికి మాత్రమే సెలెక్టివ్‌గా ఇస్తున్నారని తెలిపారు.

# నేదునూరి మాట

## చూపులు కలిసిన శుభవేళ.

ఈనాటి బంధం
ఏనాటి భంధమో
తొలి సారి మన చూపులు
కలిసిన ఆ శుభ వేళ
నా మదిలో చిగురించిన
ఆశల పల్లవి నీవు

నేడు ఏడడుగుల భందంతో
ఒకటైన వేళ నా జీవితాన్ని
నడిపించే ప్రేమ కావ్యం నీవు
అనురాగం పండగ అభిమానం
వికసించగా ప్రేమ అంకురించెను

ఆత్మీయత బంధ మాయే
ఆర్ధత ఆభరణ మాయే
అణుకువ ఆదరణ తోడు నీడాయే

కలలు కన్న లోకానికి
కళ్ళద్దంలా కష్ట సుఖాల్లో
తోడుండే ప్రాణ నేస్తంలా
గుండెల్లో గుర్తుండే తీపి
జ్ఞాపకాలు చేసిన భాసలు
మనకు మూలధనమాయే

మౌనంగా ఉన్న మాటలన్నీ
నీ కళ్ళలో అర్థమయ్యాయి
మన ఇద్దరి చూపులు కలిసిన
ఆ అపురూప క్షణాన
మాటల మాధుర్యంలో
కాలచక్రమే బంధీ ఆయేను

అతిథుల పలకరింపుల
పరవశం మదికి హాయినిచ్చేను
నీచేతిలో చేయివేసి నడచిన ప్రతి
అడుగు నాకు ఒకసరికొత్త
లోకాన్ని పరిచయం చేసింది

నిన్నటి తీపి జ్ఞాపకాలే
నేటి జీవితానికి మల్లెల
మాలలాయే
మన దాంపత్య జీవితానికి
పవిత్ర భందమాయే
మంచి మాటలు మన
ఆనందానికి బాటలాయే

నాటి ఊసులే నేడు మన
ఉనికికి ఊతమాయే
నాటి సరాగాలే
నేటి సంతోషాలకు
సంబరాలకు వేదికాయే

చూపులు కలసిన శుభవేళ
పెళ్లి పేరంటాలకు పిలుపాయె
ఆత్మీయ ఆతిథ్యాలకు వేళాయే
చిన్న పెద్ద అతిథుల సందడితో
కుటుంబాల బంధాలు ముడివడె

పోయిన జన్మ బంధం ఏడు
తరాలకు భందువాయె
మమతల మల్లెలు
మానవీయ పరిమళాలు
శుభాకాంక్షల సుమధురాలు
నిత్య కళ్యాణంపచ్చతోరణాలు
మనకు పందిరాయే

అతిథుల ఆశీర్వాదాలు
ఆత్మీయుల ఆలింగనం
పెద్దల దీవెనలు
మన భావి జీవితానికి
దారి దీపమాయే

**నేదునూరి కనకయ్య**
అధ్యక్షులు
తెలంగాణ రాష్ట్ర
ఎకనామిక్ ఫోరం
తెలంగాణ వికాస వేదిక

కరీంనగర్
9440245771



# రాగంపేట ఆర్యవైశ్య స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కుంకుమార్చన

**కరీంనగర్,జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాగంపేట ఆర్యవైశ్య స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణమంటపంలో జరుగుతున్న శ్రీమద్రామాయణ ప్రవచన జ్ఞాన యజ్ఞంలో భాగంగా ఈరోజు ఉదయం 216 మంది సుహాసినిలతో కుంకుమార్చన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది.స్త్రీల సౌభాగ్యం, కుటుంబ శాంతి, ఐశ్వర్యాభివృద్ధి కోసం నిర్వహించే ఈ కుంకుమార్చనలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన సుహాసినులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని ఆరాధించారు. పౌరోహితులు భూశంకర శర్మ లలితా సహస్రనామాలు, అష్టోత్తర శతనామాలతో పూజలు నిర్వహించగా, భక్తులు భక్తి పారవశ్యంతో పాల్గొన్నారు. ఈ పూజ ద్వారా



కుటుంబ సౌఖ్యం, సంతాన భాగ్యం, ఆయురారోగ్యం, ఐశ్వర్యం లభిస్తాయని వేదపురాణాల్లో పేర్కొనబడిందని పండితులు వివరించారు. నిర్వాహకులు నలుమాచు మనోహర్ మాట్లాడుతూ ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో సానుకూలతను, మహిళల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.కార్యక్రమంలో సంస్థ సభ్యులు నలుమాసు సుదర్శనం, నలుమాచు చంద్రశేఖర్, కొండ రమేష్, రాచర్ల వెంకటేశం, పాత సుధాకర్, తణుకు రామకృష్ణ, భూపతి, శేఖర్, డెకొరేషన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లాలో విద్యాశాఖ అధికారుల అక్రమాలు విజిలెన్స్ విచారణకు టీఎస్ఎస్వో డిమాండ్

**రంగారెడ్డి, జనవరి 21(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీ పరాకాష్టకు చేరిందని, దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారులు పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారని తెలంగాణ సోషల్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ (టీఎస్ఎస్వో) ఆరోపించింది. రంగారెడ్డి జిల్లా ఆఫీసర్ అరంఘర్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించిన రాష్ట్ర ప్రతినిధి మానాజీపేట్ రమేష్ మాట్లాడుతూ, అనుమతులు ఒకచోట ఇచ్చి పలు చోట్ల బ్రాంచీలు నడపడం, ఎనిమిదో తరగతి వరకే అనుమతి ఉన్న పాఠశాలలు పదో తరగతి వరకు అక్రమంగా నిర్వహించడం, స్టేట్ సిలబస్ పర్మిషన్‌తో




సీబీఎస్ఈ, ఐసిఎస్ఈ పేర్లతో ప్రజలను మభ్యపెట్టి లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేయడం వంటి అక్రమాలు విస్తృతంగా జరుగుతున్నాయని తీవ్రంగా విమర్శించారు. ఈ అక్రమాలపై ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా డీఈఓ స్పందించకపోవడం, ఇప్పటివరకు ఒక్క అక్రమ పాఠశాలను కూడా సీజ్ చేయలేకపోవడం అధికారుల అసమర్థతకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు తొత్తులుగా మారిన అధికారులపై వెంటనే విజిలెన్స్ టీమ్‌తో సమగ్ర విచారణ జరపాలని, తక్షణ చర్యలు తీసుకోకపోతే న్యాయస్థానాల ద్వారా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న అధికారులను బోనులో నిలబెడతామని హెచ్చరించారు.

# ఎలిగేడు లో విద్యుత్ వినియోగదారుల సదస్సు

**ఎలిగేడు, జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయ ఆవరణలో ఎలిగేడు, కాట్నపల్లి, సుల్తానాబాద్, కనుకుల సెక్షన్లకు సంబంధించిన విద్యుత్ వినియోగదారుల సదస్సు బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీజీ ఎన్పీడీసీఎల్ వినియోగదారుల చైర్మన్ వేణుగోపాల చారి హాజరై, విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రత్యేకంగా లోకల్ కోర్టును ఏర్పాటు చేసినట్లు



తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు, వోల్టేజ్ హెచ్చుతగ్గులు, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థ పెంపుదల, లోపాలు ఉన్న మీటర్ల మార్పు, కొత్త సర్వీసులు మంజూరు, అదనపు లోడును క్రమబద్ధీకరణ, సర్వీసు పేరు మార్పు, సర్వీసు రద్దు, కేటగిరి మార్పు వంటి సమస్యల పరిష్కారానికి వినియోగదారులు రాతపూర్వకంగా, మెయిల్ లేదా వాట్సాప్ ద్వారా ఫిర్యాదులు ఇవ్వాలని ఆయన సూచించారు. ఎలిగేడు మండల కేంద్రంలో నిర్వహించిన ఈ సదస్సుకు వినియోగదారుల నుండి అనూహ్య స్పందన లభించిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో టీజీ ఎన్పీడీసీఎల్ టెక్నికల్ మెంబర్ దేవేందర్, రమేష్, ఇండిపెండెంట్ సభ్యుడు రామారావు, పెద్దపల్లి విద్యుత్ శాఖ డీఈ రాజ బ్రహ్మచారి, ఎడి రామస్వామి, ఏఈ సంపత్ కుమార్, విద్యుత్ శాఖ అధికారులు, వినియోగదారులు పాల్గొన్నారు.

# బోడుప్పల్‌లో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్



**బోడుప్పల్, జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గ్రేటర్ హైదరాబాద్ బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఏ.శైలజ ఆదేశాల మేరకు 22వ వార్డు న్యూహేమ్ నగర్ కాలనీలో బుధవారం ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. కాలనీలోని ప్రతి ఇంటి నుండి పాత బట్టలు, బొమ్మలు, పుస్తకాలు, బ్యాగులు, బ్లాంకెట్లు, షూస్ వంటి వాడిన వస్తువులను సేకరించి మున్సిపల్ సిబ్బంది రీసైక్లింగ్ సెంటర్లకు పంపించారు. రీసైక్లింగ్ అనంతరం ఆ వస్తువులను నిరుపేద కుటుంబాలకు, అనాథ ఆశ్రమాలకు ప్రభుత్వం తరపున అందజేస్తామని అధికారులు తెలిపారు. ప్రతి ఒక్కరు తమవంతు బాధ్యతగా పాత వస్తువులను అందించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ గుర్రాల సత్యనారాయణ, ఆర్పీ ఇదుల రేణుక, సిబ్బంది నరేష్, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

# మంచాలలో విద్యా కమిషనర్ ఆకునూరి మురళి పర్యటన

**మంచాల,జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంచాలను విద్యా కమిషనర్ చైర్మన్ ఆకునూరి మురళి సందర్శించారు.
మంచాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొత్తగా రెండంతస్తుల భవన నిర్మాణం, బాక్స్ క్రికెట్, వాలీబాల్, కొక్కో, కబడ్డీ కోర్టులు, అథ్లెటిక్స్ గ్రౌండ్ అభివృద్ధి పై సూచనలు చేశారు. గ్రౌండ్‌లో ఉన్న ఎలక్ట్రిక్ పోల్స్ తొలగించాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో అభివృద్ధి పనులను సమీక్షించారు. బాలికల ఉన్న నాలుగు గదులను బీసీ బాలికల హాస్టల్‌కు కేటాయిస్తూ, భవనంపై మరొక అంతస్తు నిర్మించి



గదులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రాందాస్, కళాశాల ప్రిన్సిపల్ తిరుపతయ్య, పాఠశాల హెడ్మాస్టర్లు, పబ్లిక్ స్కూల్ కన్వీనర్ ఆర్. నారాయణ రెడ్డి, హాస్టల్ వార్డెన్ శశిరేఖ, సంక్షేమ అధికారి రమేష్, విద్యా కమిటీ సభ్యులు అశ్వాల బాలరాజ్, సుధాకర్, శ్రీనివాస్ రెడ్డి, లింగం, గీత, సంకీర్తన, విజయ, ముత్యాలు, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మార్కండేయ జయంతి వేడుకలు



**ఎలిగేడు, జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పద్మశాలీల కుల ఆరాధ్య దైవం శ్రీ భక్త మార్కండేయ జయంతి పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీ వీర హనుమాన్ శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి దేవాలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కండేయ స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి తీర్థ ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో పాల్గొన్న పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు మామిడాల రమేష్ మాట్లాడుతూ పరమశివుని అపార భక్తితో మృత్యువును జయించి చిరంజీవిగా అవతరించిన సద్గుణుడు మార్కండేయుడని, ఆయన స్ఫూర్తితో ఆధ్యాత్మికతను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. వేడుకలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు వెంగళదాస్ రాజమౌళి, మాజీ ఎంపీటీసీ బూర్ల సత్యనారాయణ, కమిటీ సభ్యులు వెంగళదాస్ భాస్కర్, బూర్ల రాజేశం, కోడూరి ఆంజనేయులు, ఐట్ల శ్రీనివాస్, కట్ల ప్రకాష్, బింగి రాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు ఏర్పాటు చేయండి.

-సిఐ సుబ్బారెడ్డి



**ఎలిగేడు, జనవరి 21: (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఎలిగేడు లాలపల్లి గ్రామ శివారు ప్రాంతంలోని పెల్లి పోరు గుట్ట వద్ద నిర్వహించే సమ్మక్క సారలమ్మ జాతర పనులను సుల్తానాబాద్ సిఐ సుబ్బారెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. వివిధ గ్రామాల నుండి సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు , ట్రాఫిక్ జామ్ కలుగకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖ అధికారులను జాతర నిర్వహణ కమిటీని ఆయన ఆదేశించారు. ఆయన వెంట ఎలిగేడు ఎస్సై మధుకర్, ూూఅ లు శ్రీనివాస్, శ్రావణ్ కుమార్, సర్పంచ్ లు కప్పల ప్రవీణ్, ఏలేటి వెంకట్ రెడ్డి, రంగు లత శ్రీనివాస్, ఉప సర్పంచ్ ముంజం నరేష్, ఎలిగేడు సింగిల్ విండో మాజీ చైర్మన్లు నరహరి సుధాకర్ రెడ్డి, గోపు విజయభాస్కర్ రెడ్డి,జాతర కమిటీ చైర్మన్ సాగర్, ఉపాధ్యక్షులు అడ్డగుంట రవి, కోశాధికారి అమ్ముల కుమారస్వామి, మాజీ సర్పంచ్ మండిగా రాజనరసయ్య, మాజీ ఉపసర్పంచ్ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# మదర్సా లో ఉచిత వైద్య శిబిరం

**ఆమనగల్లు, జనవరి 21(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**



ఆమనగల్లు మండలం చింతలపల్లి గ్రామ సమీపంలోని మదర్సా పాఠశాలలో బుధవారం మైనార్టీ విద్యార్థులకు వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 72 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వివరిస్తూ , వ్యాధుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు మైమున బేగం, విజయలక్ష్మి,విజయ, సిహెచ్ఓ చంద్రశేఖర్, అలీం, సల్మా, సరోజ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాద బాధితున్ని ఆదుకుంటాం

-ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**తలకొండపల్లి, జనవరి 21(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
తలకొండపల్లి చౌరస్తాలో మంగళవారం రాత్రి వాటర్ సర్వీసింగ్ సెంటర్ లో జరిగిన అగ్ని ప్రమాదంలో బాధితుడైన అంతారం గ్రామానికి చెందిన నాగేష్ ను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన ప్రమాద స్థలాన్ని పరిశీలించి, తాసిల్దార్ రమేష్ తో మాట్లాడి ప్రభుత్వం తరఫున తక్షణ సహాయం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, యాట నర్సింహ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి




**ఆమనగల్లు, జనవరి 21(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని ఆమనగల్లు వ్యాపారవేత్త కోట మహేష్ అన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న జబ్బు మహేష్ స్మారక మున్సిపాలిటీ స్థాయి క్రికెట్ లీగ్ క్రీడాకారులకు ఆయన దుస్తులు, బహుమతులు అందజేయడం జరిగింది. ఆమనగల్లు క్రికెట్ అసోసియేషన్ తరఫున కోట మహేష్ కి శాలువాలతో ఘనంగా సన్మానించడం జరిగింది. కార్యక్రమంలో సతీష్, లక్ష్మణ్,రంజిత్,మహేష్, క్రీడాకారులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్ ఇండియా ఛాలెంజ్ క్యాలెండర్ ఆవిష్కరణ



**గంగాధర,జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ అధినేత, మాజీ రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా కెమెరాలో బంధించిన పక్షుల చిత్రాలతో రూపొందించిన 2026 క్యాలెండర్లను చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ నివాసంలో అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు గుంటి శంకర్, హరిత సేన నియోజకవర్గ ఇంచార్జ్ అఖిల్, గురజాల కోటి, కమల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కప్ సన్నాహక సమావేశం

**గన్నేరువరం జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గన్నేరువరం మండల పరిషత్ కార్యాలయంలో సీఎం కప్ నిర్వహణకు సంబంధించి సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు. సీఎం కప్ కార్యక్రమాన్ని విజయవంతంగా ఎలా నిర్వహించాలో ఎంపీడీఓ వివరించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ జి. రామానుజాచార్యులు, డీటీ జి. ప్రణీత్ కుమార్, ఎంపీ ఓ వి. సురేందర్, ఎంఈఓ రామయ్య, పీడీలు వి. ప్రవీణ, రమతో పాటు పంచాయతీ కార్యదర్శులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# మహా జాతర మన మేడారం



పచ్చని అడవిలో కొలువైన సమ్మక్క సారక్క
కుంకుమ బరిణే లో గద్దెకు పయనం
కోయ పూజారులతో కొలువైన చిలకలగుట్ట
తల్లికి తడి బట్టలతో తానాలతో పూనకాలు!!

ధరణిలో సమ్మక్క సారక్కలు
కంక వనంలో సమ్మక్క సారక్క
మమ్ముకాపాడే సమ్మక్క సారక్క
కోయ ప్రాంతమందు సమ్మక్క సారక్క!!

వీరులు శూరులు సమ్మక్క సారక్క
త్యాగాల సిరులు సమ్మక్క సారక్క
కుంకుమ భరణిలో సమ్మక్క సారక్క పూజలు
సమ్మక్క సారక్క దీవెనలతో కొంగుబంగారం!!

తల్లికి నిలువెత్తు బంగారు బెల్లంతో భక్తుల మొక్కులు
అంబరమంటే సంబురం మన మేడారం
కోరిన కోరికలు తీర్చే సమ్మక్క సారక్కలు
భారతదేశం లో జరిగే అతి పెద్ద జాతరమేడారం!!

వన జాతర మన జాతర మేడారం
పచ్చని అడవిలో పవిత్ర జాతర మేడారం
బంగారం పెట్టి బాగుండాలని కోరే భక్తులు
నలుమూలల నుండి తరలివచ్చే భక్తులు
మహిమలున్న దేవతా మూర్తి సమ్మక్క
ములుగులో మూడు రోజుల పండుగ మన మేడారం జాతర!!

దేవులపల్లి రమేశ్
కలం: శ్రీ వర్ష
సిద్దిపేట, నంగునూర్
చరవాణి :- 9963701294



# నేటి నుంచి శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

-- 25న స్వామివారి కళ్యాణం
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ నిర్వాహకులు





**కడ్తాల్, జనవరి 21 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
కడ్తాల్ మండలం మక్తమాదారం గ్రామంలో నేటి నుంచి శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. వారం రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ఆలయ ధర్మకర్త వింజమూరి రామానుజచార్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. కార్యక్రమాలు ఇలా ఉన్నాయి. 22న స్వామివారికి ప్రత్యేక పూజలు, 23న అర్చనలు, అభిషేకలు, పూజలు, 24న గరుడసేవ, ఎదురుకోళ్లు, 25న స్వామివారి కళ్యాణం రాత్రికి రథోత్సవం, 26న అశ్వవాహన సేవ, ప్రత్యేక పూజలు, 27న చక్రతీర్థం కార్యక్రమాలతో ఉత్సవాలు ముగిస్తాయని తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## నల్లగొండ మున్సిపల్ కమిషనర్ గా బి శరత్ చంద్ర



**నల్లగొండ,జనవరి 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నల్లగొండ మున్సిపల్ కమిషనర్‌గా కొనసాగుతున్న సయ్యద్ ముసాబ్ అహ్మద్ బదిలీపై హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.ఆయన స్థానంలో జిహెచ్‌ఎంసీ నుంచి బదిలీపై వచ్చిన బి. శరత్ చంద్ర నల్లగొండ మున్సిపల్ కమిషనర్‌గా నియమితులయ్యారు.
ఆయన నేడు అధికారికంగా బాధ్యతలు స్వీకరించనున్నారు
ఈ బదిలీలతో నల్లగొండ మున్సిపాలిటీలో పరిపాలనా మార్పులు చోటు చేసుకున్నాయి రాబోయే రోజుల్లో అభివృద్ధి పనులు, పారిశుధ్యం, పట్టణ సదుపాయాలపై కొత్త కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు సమాచారం.

## టీఎన్జీవోస్ క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి




**నల్లగొండ ,జనవరి 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నల్గొండ జిల్లా టిఎన్జీవోస్ 2026 జిల్లా డైరీ, క్యాలెండర్ ను హైదరాబాద్ లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉద్యోగులకు అన్ని విధాల సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల మురళి, ప్రధాన కార్యదర్శి శేఖర్ రెడ్డి, పలువురు సంఘం నాయకులు పాల్గొన్నారు

## సంస్కరణల ఆద్యుడు సాలార్ జంగ్ కు ఘన నివాళి



**నల్లగొండ ,జనవరి 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
హైదరాబాద్ సంస్థాన మాజీ ప్రధానమంత్రి, రెవిన్యూ సంస్కరణల రూపకర్త సాలార్ జంగ్ 197వ జయంతి వేడుకలను జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.యునైటెడ్ ముస్లిం మైనారిటీ హక్కుల సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వక్తలు ఆయన సేవలను కొనియాడారు. అభ్యుదయ భావాలతో నాడే పకడ్బందీగా భూ రికార్డులను రూపొందించిన దూరదృష్టి ఆయనకే సాధ్యమైందని ప్రశంసించారు ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

### మహిళా డిగ్రీ కళాశాలలో వ్యాపార అవగాహన, ఏఐ వర్క్‌షాప్

**కరీంనగర్ జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**




ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో విద్యార్థినుల కోసం ఇంట్రెప్రెన్యూర్షిప్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. వ్యాపార రంగ ప్రాముఖ్యత, ప్రభుత్వ పథకాలు, నైపుణ్యాభివృద్ధి అంశాలపై నిపుణులు అవగాహన కల్పించారు.అదే కళాశాలలో అధ్యాపకుల కోసం అడ్వాన్స్‌డ్ ఏఐ వర్క్‌షాప్ ప్రారంభమైంది. వన్ హబ్ గ్లోబల్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐ వినియోగం, బోధనలో ఆధునిక టూల్స్, మూల్యాంకన విధానాలపై శిక్షణ ఇచ్చారు. మొదటి రోజు కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# చరికొండలో కాంగ్రెస్ నిరసన

**-పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, పిసిసి సభ్యుడు శ్రీనివాస్ గౌడ్**




**కడ్తాల్, జనవరి 21 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తూట్లు పొడుస్తూ మోడీ సర్కార్ నూతనంగా తీసుకువచ్చిన వీబీజీ రామ్ జీ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజి నరేగా) స్థానంలో మోడీ సర్కారు కొత్తగా తీసుకువచ్చిన వీబీజీ – రాంజీ 2025 వికసిత్ భారత్ గ్యారంటీ రోజ్ గార్ అండ్ ఆజీవికా మిషన్ గ్రామీణ బిల్లును కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. ఈ నేపథ్యంలో గౌరవ పిసిసి అధ్యక్షులు పిలుపుమేరకు కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వం దేశవ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చిన క్రమంలో రంగారెడ్డి జిల్లాలోని కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్ మండల పరిధిలోని చరికొండ గ్రామంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, చల్లా నరసింహారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి సర్కార్ దేశ స్వాతంత్రోద్యమ కాలపు జాతి నేతల పేర్లను నిస్సిగ్గుగా తొలగించేందుకు వెనకాడటం లేదంటూ మండిపడ్డారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి దాని స్థానంలో కొత్త చట్టం తీసుకురావటం దుర్మార్గం అన్నారు, ఆర్ఎస్ఎస్ భావజాలంతో బిజెపి ప్రభుత్వం మహాత్మునిపై విద్వేషం వెలగక్కుతుందన్నారు. మతోన్మాదం ప్రతిబింబించేలా కొత్త చట్టాలకు పేర్లు పెడుతుందన్నారు ఇది భారత దేశ లౌకిక రాజ్యాంగానికి పూర్తి విరుద్ధమన్నారు ఈ చర్యను బిజెపి ఆ ప్రజాస్వామిక పాలనకు పరాకాష్టగా పేర్కొనవచ్చున్నారు. వర్షాభావంతో కరువుకూరల్లో చిక్కుకున్న రైతు కూలీలకు ఉపాధి కల్పించేందుకు చేపట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బిజెపి ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చిందన్నారు. నూతన చట్టం రాష్ట్ర ప్రభుత్వాలపై అదనపు భారం మోపనుందన్నారు. మన రాష్ట్రాల సుమారు 3000 కోట్ల భారాన్ని మోయాల్సి వస్తుందన్నారు, 60 రోజుల పాటు ఉపాధి పనులపై నిషేధం రాష్ట్రాలపై భారం వేయడంతో ఉపాధి పని రోజులు తగ్గిపోతాయన్నారు, వ్యవసాయ సంక్షోభం పెరిగి మరిన్ని ఆత్మహత్యలకు దారితీస్తుందని వారు అన్నారు ఓవైపు మహాత్మా గాంధీ పేరు తొలగింపు మరోవైపు రాష్ట్రాలపై అదనపు భారం పడుతున్న ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ నోరు మెదపకపోవడం చూస్తుంటే కేంద్రం వద్ద చేతకాని పిరికిపందల మారారా.. అన్నట్లు అనిపిస్తుందని వారు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీల ఆగ్రహానికి గురికాకముందే నూతన చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో పిసిసి మెంబర్ శ్రీనివాస్ గౌడ్, నాయకులు రాజిరెడ్డి, యాట నరసింహ, సర్పంచ్ మహేందర్ గౌడ్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రోహిత్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు బిచ్య నాయక్, శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రాములు, చాప బీమ్, వెంకటేష్, రామకృష్ణ మరియు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దూడలకు నట్టల నివారణ మందుల పంపిణీ

**కడ్తాల్, జనవరి 21 ( నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
కడ్తాల్ మండల పరిధిలోని కొండ్రిగాని బావి తండాలో ఆవు దూడలకు నట్టల నివారణ మందుల కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చేగురి వెంకటేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, వెంకటేశ్ మాట్లాడుతూ రైతులకు అండగా పాల ఉత్పత్తిదారులకు చేయూత అందించడానికి క్లబ్ ద్వారా నట్టల నివారణ మందులను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఆరోగ్యవంతమైన దూడలను గుర్తించి పాడి రైతులకు బహుమతులను మరియు ప్రోత్సాహకాలను అందించినట్లు క్లబ్ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి లయన్స్ క్లబ్ జిల్లా పోషకాల సంఘం చైర్మన్ చెగూరి వెంకటేశ్ అన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ముందుకు వచ్చి ఉపాధి కల్పనకు ఆవులను, గేదెలను ఏర్పాటు చేసుకుని పాల ఉత్పత్తి పెంచాలని వారు ఉపాధి అవకాశాలు పెంపొందించుకోవాలని కోరారు. పాడి పరిశ్రమకు ముందుకు వచ్చే వారికి పాడి పరిశ్రమ ద్వారా సహకారం అందిస్తామని జిల్లా చైర్మన్ వెంకటేశ్



అన్నారు. తండాలో ఉన్న 30 దూడలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేసినట్లు క్లబ్ పిఆర్ ఓ పాషా తెలిపారు. ఈ క్రమంలో ఆరోగ్యవంతమైన దూడలు 5 నెలలు, 3 నెలలు, 2 నెలలుగా ఉన్న దూడలను గుర్తించి ఎంపిక చేసిన పశుపోషకులకు బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, కార్యదర్శి గంప శ్రీను, కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి, సర్పంచు శారదా బిక్కు నాయక్, క్లబ్ సభ్యులు బిచ్చ నాయక్, జహంగీర్ అలీ, రాజు యాదవ్, లక్ష్మణ్, దీప్లా, కిషన్, బీమా, రంగా, క్లబ్ పిఆర్ఓ పాషా తదితరులు పాల్గొన్నారు.

# విద్యతో ప్రజాసేవకు బలమైన బాట

**-జర్నలిజంలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసిన లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి యువతకు ఆదర్శం**
**-మాజీ శాసనసభ్యులు జైపాల్ యాదవ్**



**కడ్తాల్, జనవరి 21 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
ప్రజాసేవలో చురుకైన పాత్ర పోషిస్తూనే ఉన్నత విద్యపై ప్రత్యేక దృష్టి సారించిన లక్ష్మి నర్సింహ్మా రెడ్డి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని జైపాల్ యాదవ్ అన్నారు.కడ్తాల్ మాజీ సర్పంచ్, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి జర్నలిజం విభాగంలో మాస్టర్స్ పట్టా సాధించిన సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఆయన నివాసంలో లక్ష్మీ నర్సింహ్మా రెడ్డిని ప్రత్యేకంగా అభినందించి శాలువాతో సత్కరించారు. ప్రజాసేవతో పాటు విద్యను సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్న తీరు ప్రశంసనీయమని ఆయన పేర్కొన్నారు. సమాజంలో మార్పు తీసుకురావాలంటే అవగాహనతో కూడిన విద్య అవసరమని,జర్నలిజం,న్యాయ శాస్త్రం,కంప్యూటర్ సైన్సెస్ వంటి రంగంలో లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి ఉన్నత చదువులు పూర్తి చేయడం అభినందనీయమని తెలిపారు.జైపాల్ యాదవ్ మాట్లాడుతూ, సమాజ సేవలో విద్యాభ్యాసం ప్రజల సమస్యలను మరింత సమర్థవంతంగా వెలుగులోకి తీసుకురావడానికి ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యువత చదువుతో పాటు సామాజిక బాధ్యతను గుర్తించి ముందుకు రావాలని ఆయన కోరారు. ప్రజాసేవ, విద్య రెండింటినీ సమంగా ముందుకు తీసుకెళ్తూ లక్ష్మి నర్సింహ్మా రెడ్డి చూపుతున్న మార్గం నేటి యువతకు ఆదర్శమని పలువురు అభిప్రాయపడ్డారు. శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో మాధారం మాజీ సర్పంచ్ లక్ష్మీ దేవి నర్సింహ్మా గౌడ్,మాజీ సర్పంచులు కృష్ణయ్య, వెంకటయ్య,మాజీ ఎంపీటీసీ చంద్రమౌళి,బాలకృష్ణ,రాములు నాయక్, కోట్యా నాయక్,శ్రీకాంత్ యాదవ్,నరేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.

# 29 నుంచి శ్రీశ్రీ శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

**- బ్రహ్మోత్సవాల సందర్భంగా కద్దాల గ్రామ పెద్దల సమీక్ష సమావేశం**
**- ఆలయంలో బ్రహ్మోత్సవాల కరపత్రం విడుదల చేసిన గ్రామ పెద్దలు**



**కద్దాల్, జనవరి 21 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
కద్దాల్ పట్టణంలోని శ్రీశ్రీశ్రీ లక్ష్మి నరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుపుకునేందుకు గ్రామ పెద్దలు డిసిసిబి డైరెక్టర్ ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, సర్పంచ్ బిక్షపతి, రాలే కమిటీ అధ్యక్షుడు పాలాది ఆంజనేయులు, ఉత్సవ పర్యవేక్షకులు మేల్లూరి వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆలయంలో బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై చర్చించారు. ప్రతి ఏటా నిర్వహించే ఏర్పాట్లు ఈ సంవత్సరం కూడా అంగరంగ వైభవంగా జరుపుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈనెల 29 నుంచి వోచ్చేనెల 3వ తేదీ వరకు ఆరు రోజులపాటు వైభవోపేతంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాలనుండి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయడంతో పాటు విద్యుత్ దీపాలంకరణ చేసి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేయనున్నారు. ఈనెల 29న విగ్నేశ్వర పూజ అఖండ దీపారాధన ధ్వజరోహణము అంకురార్పణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 30 న స్వామివారికి ఎదురు కోళ్ల కార్యక్రమం 31న స్వామివారి కల్యాణోత్సవం పుష్పమాల సేవ రథోత్సవము చిన్నతేరు శివాలయం దగ్గర అగ్నిగుండం వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 1న కుంకుమార్చన అగ్ని ప్రతిష్ట పెద్దతేరు 2 న హనుమాన్ చాలీసా పారాయణం ధోపోత్సవం 3న కుంకుమార్చన ప్రత్యేక పూజలు చక్రతీర్థం గరుడసేవ ఊరేగింపు నాగవల్లి కార్యక్రమం తో కార్యక్రమాలు ముగియడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. కావున భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి తీర్థ ప్రసాదం స్వీకరించాలని వారు కోరారు.

## ఘనంగా భక్త మార్కండేయ జయంతి వేడుకలు



**పాలకుర్తి, జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పాలకుర్తి మండలం బసంతనగర్‌లో శ్రీ భక్త మార్కండేయ మహాముని జయంతి వేడుకలు పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు పెద్దపల్లి జిల్లా తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ముఖ్య అతిథిగా హాజరై, సాంప్రదాయబద్ధంగా భక్త మార్కండేయుని చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. అనంతరం భక్తులకు సీట్లు పంపిణీ చేశారు. సంఘ నాయకులు మాట్లాడుతూ భక్త మార్కండేయ స్ఫూర్తితో పద్మశాలీలు ఐక్యతతో ముందుకు సాగి సేవా కార్యక్రమాలను కొనసాగించాలని సూచించారు. పాలకుర్తి మండలంలో పద్మశాలీల అభివృద్ధి కోసం ప్రత్యేక భవనం నిర్మించాలని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తాటిపాముల రమేష్, ఉపాధ్యక్షుడు బండి శ్రీనివాస్, కోశాధికారి కొలిపాక నగేష్, పెండం సత్యనారాయణ, కుడికాల హరీష్, చింతకింది రమేష్, చింతకింది కనకయ్య, చిప్ప మల్లేష్, తన్నీరు శ్రీనివాస్, బూర్ల రామకృష్ణ, తాటిపాముల పోచాలు, తాటిపాముల కిషన్, మేన మహేందర్, లక్ష్మీనర్సయ్యతో పాటు పద్మశాలి కుల బంధువులు పాల్గొన్నారు.

## ఈశాల తక్కల్లపల్లి జాతర ఏర్పాట్ల పరిశీలించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**పాలకుర్తి ,జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
పాలకుర్తి మండలం ఈశాల తక్కల్లపల్లి గ్రామంలో జరగనున్న శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ బుధవారం పరిశీలించారు. అనంతరం అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం వద్ద ఇరవై లక్షల రూపాయలతో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పర్యవేక్షించి, జాతరకు ఇంకా వారం రోజుల సమయం మాత్రమే ఉండడంతో పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు త్రాగునీరు, విద్యుత్, టాయిలెట్స్, స్నానాల వంటి సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. జాతర సజావుగా సాగేందుకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని బసంతనగర్ ఎస్ఐ నూతి శ్రీధర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి ఎంపీడీఓ శశికళ, ఎమ్మార్వో సునీత, రామగుండం మార్కెట్ కమిటీ చైర్మన్ గాలిపల్లి తిరుపతి, సర్పంచులు బండి శ్రీనివాస్ గౌడ్, తోట స్వప్న మహేష్, అన్నం లక్ష్మీనారాయణ, పర్శవేణి శ్రీనివాస్, ఉప సర్పంచ్ ఒడ్నాల జ్యోతి రాజు, వార్డు సభ్యులు, మాజీ వైఎస్ ఎంపీపీ ఎర్రం స్వామి, సూర సమ్మయ్య, మల్లెత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంసిహెచ్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలి

**- కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**పెద్దపల్లి ,జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
: పెద్దపల్లి పట్టణంలోని మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని హెల్ప్ డెస్క్, స్కానింగ్ రూమ్, చిన్నపిల్లల వార్డు, ఫార్మసీ, ఆర్థో, జనరల్ వార్డులు, ప్రసూతి ఓపి, పాలాటివ్ కేర్ వార్డ్, డయాగ్నోస్టిక్ హబ్, బ్లడ్ బ్యాంక్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఫార్మసీ స్టోర్‌లో అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉండాలని, ల్యాబ్‌లో రక్తపరీక్షల కోసం అవసరమైన పరికరాలు ఉంటే వివరాలు అందించాలని సూచించారు. గర్భిణీ మహిళలు, పిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన పరికరాలపై ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. తదుపరి పట్టణంలో నిర్మాణంలో ఉన్న వంద పడకల ఆసుపత్రి పనులను పరిశీలించి, సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, పి.ఓ. డాక్టర్ వాణిశ్రీ, ఆర్ఎంఓ డాక్టర్ విజయ్, జనరల్ సర్జన్ డాక్టర్ సాయి ప్రసాద్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు - కలెక్టర్ డి. వేణు



**పెద్దపల్లి, జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలో జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఘనమైన ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ డి. వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వేడుకలు కలెక్టరేట్ ప్రాంగణంలో జరుగుతాయని, ప్రతి శాఖ అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. జాతీయ పతాక ఆవిష్కరణ, గ్రౌండ్ సిద్ధం, డయాస్, సీటింగ్ ఏర్పాట్లు పోలీస్, రెవెన్యూ శాఖల సమన్వయంతో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, వైద్య బృందాల ఆధ్వర్యంలో శిబిరాలు ఏర్పాటు చేయాలని, త్రాగునీటి క్యాన్లు మున్సిపల్ కమిషనర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యాశాఖ అధికారులు విద్యార్థుల తరలింపులో అప్రమత్తంగా ఉండాలని, సాంస్కృతిక కార్యక్రమాలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆయన పేర్కొన్నారు. తరువాత కలెక్టరేట్ ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను అదనపు కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సమావేశంలో రెవిన్యూ డివిజనల్ అధికారి గంగయ్య, ఏసీపీ జి. కృష్ణ, పరిపాలన అధికారి బి. ప్రకాష్, మున్సిపల్ కమిషనర్లు వెంకటేష్, రమేష్‌తో పాటు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ రగ్బీ పోటీలకు రైజింగ్ సన్ విద్యార్థి ఎంపిక




**పెద్దపల్లి ,జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ అంబేద్కర్ క్రీడా మైదానంలో నవంబర్ 6, 2025న జరిగిన జిల్లా స్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన రైజింగ్ సన్ పాఠశాల విద్యార్థి వికాస్ రాష్ట్రస్థాయి అండర్14 రగ్బీ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ పోటీలు జనవరి 22 నుండి 24 వరకు మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ జిల్లా పరిషత్ హై స్కూల్‌లో జరగనున్నాయి. వికాస్ ఎంపికైన విషయాన్ని వ్యాయామ ఉపాధ్యాయుడు తగరం తిరుపతి వెల్లడించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సయీద్ అహ్మద్, ప్రధానోపాధ్యాయుడు హాకీమ్ ఖాన్ విద్యార్థిని అభినందించారు.

## ఘనంగా ప్రారంభమైన శ్రీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు



**పాలకుర్తి, జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పాలకుర్తి మండలం గుడిపల్లి గ్రామంలో శ్రీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుండి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలు 24వ తేదీ వరకు మూడు రోజుల పాటు కొనసాగనున్నాయి. గుడిపల్లి, పుట్నూరు, జయ్యారం గ్రామ ప్రజలు కలిసికట్టుగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. గురువారం అఖండ దీపారాధన, రక్షాబంధనం, శ్రీ భూనీలాదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులకు, అభయాంజనేయస్వామికి అభిషేకం, తీర్థప్రసాద వినియోగం వంటి పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. 23వ తేదీన కల్యాణోత్సవం, అక్షరాభ్యాసం, సరస్వతి పూజ, అన్నదానం నిర్వహిస్తారు. 24వ తేదీన రథోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి. ప్రతి సంవత్సరం జరిగే ఈ బ్రహ్మోత్సవాలకు చుట్టుపక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి చెన్నకేశవస్వామిని దర్శించుకుంటారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ కమిటీ ప్రకటించింది.

## ఘనంగా యువ నాయకుని పుట్టినరోజు వేడుకలు



**ఎలిగేడు, జనవరి 21 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎలిగేడు గ్రామ ఉపసర్పంచ్ యువ నాయకులు ముంజం నరేష్ కుమార్ పుట్టినరోజు వేడుకలను ఎలిగేడు యువకుల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం నరేష్ మాట్లాడుతూ నా పుట్టినరోజు వేడుకలను యువకులు ఇంత ఘనంగా నిర్వహించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎలిగేడు గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్, వార్డు సభ్యులు ,యువకులు తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఇంటర్ పరీక్షల ఏర్పాట్లు



**పెద్దపల్లి,జనవరి 21 (నీలగిరిఎక్స్‌ప్రెస్)**
జిల్లాలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు జరిగే ఇంటర్ థియరీ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లాలో జనరల్, వొకేషనల్ కలిపి 7,965 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు.జిల్లాలో ఏర్పాటు చేసిన 22 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా, త్రాగునీరు, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన ఆదేశించారు. విద్యార్థుల సౌకర్యార్థం పరీక్షా రూట్లలో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలని సూచించారు.పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, ప్రశ్నపత్రాల సీళ్లు చీఫ్ సూపరింటెండెంట్ సమక్షంలో మాత్రమే తెరవాలని, ఆ సమయంలో అధికారులు సెల్‌ఫోన్లు తీసుకురాకూడదని ఆయన స్పష్టం చేశారు. ప్రతి కేంద్రంలో పారా మెడికల్ సిబ్బంది, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కనీస మందులు అందుబాటులో ఉండేలా వైద్య శాఖ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు అధికారి కల్పన, ఆర్డీఓ గంగయ్య, ఏసీపీ జి.కృష్ణ, కలెక్టరేట్ పరిపాలన అధికారి బి.ప్రకాశ్, మున్సిపల్ కమిషనర్లు వెంకటేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు



**కరీంనగర్,జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యతారహితంగా ప్రవర్తిస్తున్నారని మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ ఆరోపించారు. బుధవారం ఆయన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి రెండవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల జరిగిన బహిరంగ సభలో సీఎం కేసీఆర్‌ను దూషించడం, బీఆర్ఎస్ పార్టీ జెండా గద్దెలను కూల్చివేయాలని పిలుపునివ్వడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలు శాంతి భద్రతలకు భంగం కలిగించేలా, రాజకీయ ప్రత్యర్థులపై ద్వేషాన్ని రెచ్చగొట్టేలా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.అధికార మదంతో సీఎం వ్యవహరిస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థను తుంగలో తొక్కుతున్నారని మండిపడ్డారు. ఇలాంటి వ్యాఖ్యల వల్ల రాష్ట్రంలో అల్లర్లు చెలరేగే ప్రమాదం ఉందని, వెంటనే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మైనారిటీ అధ్యక్షులు మీర్ షౌకత్ అలీ, నాయకులు ఆరే రవి గౌడ్, మాజీ కార్పొరేటర్ ఎదుల్ల రాజశేఖర్, శాతవాహన యూనివర్సిటీ అధ్యక్షుడు చుక్క శ్రీనివాస్, నగర అధ్యక్షుడు బొంకూరి మోహన్, సోమిరెడ్డి నరేష్ రెడ్డి, పబ్బతి శ్రీనివాస్ రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# వెలిచాల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన తిప్పారపు శ్రీనివాస్



**కరీంనగర్,జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు సమక్షంలో 12వ డివిజన్‌కు చెందిన సామాజిక కార్యకర్త తిప్పారపు శ్రీనివాస్ బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. గతంలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలలో పనిచేసిన ఆయనకు రాజేందర్ రావు కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా రాజేందర్ రావు మాట్లాడుతూ, ప్రజలకు అండగా నిలుస్తూ స్వచ్ఛంద కార్యక్రమాలతో సేవ చేస్తున్న శ్రీనివాస్ కాంగ్రెస్‌లో చేరడం అభినందనీయమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పెద్ద ఎత్తున నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో అఖండ విజయం సాధించి నగరపాలక సంస్థపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని అన్నారు.కరీంనగర్ అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని, అందుకోసమే పార్టీకి చేరానని తిప్పారపు శ్రీనివాస్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తాళ్లపల్లి మహేష్, రుద్రాక్ష కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అడవిదేవులపల్లి లో తిరుపతమ్మ స్వామి అన్నదాన కార్యక్రమం



**అడవిదేవులపల్లి, జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అడవిదేవులపల్లి గ్రామంలో ఈరోజు పెనుగ్రంచిపోలు తిరుపతమ్మ తల్లి మాలలు ధరించిన స్వాములకు ఎడవల్లి నాగరాజు ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ముందుగా తిరుపతమ్మ కుంకుమ బండి ఊరేగింపుతో కార్యక్రమం ప్రారంభమై, అనంతరం స్వాములు, భక్తులు పాల్గొన్న మహా అన్నప్రసాదం ఘనంగా జరిగింది. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

# ఘనంగా మార్కండేయ మహర్షి జయంతి వేడుకలు





**ఆమనగల్లు, జనవరి 21(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ఆమనగల్లు పట్టణంలో గుర్రం గుట్ట కాలనీలోని మార్కండేయ దేవాలయంలో బుధవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ మహర్షి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్త మార్కండేయ ఆలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి ఉత్సవాలను ప్రారంభించారు. భక్తుల సమక్షంలో మార్కండేయ డోలారోహణం ఘనంగా నిర్వహించారు. పద్మశాలీల ఐక్యత కోసం మార్కండేయ సేవలు అమోఘమని, పద్మశాలీలు అంతా ఐక్యమత్యంతో ఉండాల్సిన అవసరం ఎంతో ఉందని వారు తెలిపారు. అనంతరం స్వామివారిని పల్లకి సేవలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఎంగలి బాలకృష్ణయ్య, శివలింగం, రవి, రవి,గుద్దేటి మహేష్ నేత, మహిళా సంఘం అధ్యక్షురాలు అలివేలమ్మ, అప్పం శీను, దుర్గయ్య,అప్పి, పప్పి, యాదగిరి, గాజుల శీను, రమేష్, ఈశ్వరయ్య, శీను,గంజి శ్రీధర్, శ్రీనివాస్,భాస్కర్, శ్రీనివాస్, పున్న శీను, ప్రసాద్, కోట,నారాయణ, శివకుమార్, రాఘవ, గోపాల్,చంద్రమౌళి, ప్రవీణ్,వెంకటేష్, సుధీర్, మహిళలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# వెల్దండలో జాతీయ రోడ్డుభద్రతా మాసోత్సవాలు





**వెల్దండ,జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: వెల్దండ మండల కేంద్రంలో జాతీయ రోడ్డుభద్రతా మాసోత్సవాలను స్థానిక ఎస్సై కురుమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మట్ట యాదమ్మ, మట్ట వెంకటయ్య గౌడ్‌తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు.ఎస్సై కురుమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించి, హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన పెంపొందించుకోవడం, తోటి వారిని చైతన్య పరచడం అవసరమని ఆయన పేర్కొన్నారు. ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట ప్రమాదాలు సంభవించి ప్రాణనష్టం జరుగుతుందని, అలాంటి ఘటనలు నివారించాలంటే పోలీసులు సూచించిన భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా బుద్దార్ పేట ఆంజనేయస్వామి దేవాలయం నుండి బైక్ ర్యాలీ నిర్వహించి ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. అనంతరం హెల్మెట్ ధరించిన వాహనదారులకు ఎస్సై చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ బసన్మోని శ్రీను, వార్డు సభ్యులు, సేవాదళ్ నాయకులు, యువజన సంఘాలు, మాజీ ఆర్మీ ప్రవీణ్ రెడ్డి, స్థానిక నాయకులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా మార్కండేయస్వామి జయంతి వేడుకలు



**పెద్దపల్లి ,జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి పట్టణంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయస్వామి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పద్మశాలి భవన్‌లో హోమం నిర్వహించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష మాట్లాడుతూ, భక్త మార్కండేయుని ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకున్నారు. మార్కండేయ జయంతి కేవలం మహర్షి జన్మదినం మాత్రమే కాకుండా భక్తి, త్యాగం, ధైర్యం, మృత్యుపై విజయాన్ని ప్రతిబింబించే ఆధ్యాత్మిక ఘట్టమని తెలిపారు. మార్కండేయుడు తక్కువ ఆయుష్షు కలవాడని తెలిసినా భయపడకుండా పరమేశ్వరునిపై భక్తితో తపస్సు చేసి చిరంజీవిగా నిలిచాడని ఆమె గుర్తుచేశారు. యువత ఆయన జీవితం నుంచి ఆత్మవిశ్వాసం, ధర్మనిష్ఠ, భగవంతునిపై నమ్మకం వంటి విలువలను అలవర్చుకోవాలని సూచించారు.ఈ జయంతి పండుగ మానవ జీవనానికి దిశానిర్దేశం చేసే ఆధ్యాత్మిక సందేశమని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో కొండి సతీష్, ఆడెపు సుధాకర్, లక్ష్మీ, ధనుంజయ్, శ్రీనివాస్, అరుణతో పాటు పట్టణ పద్మశాలీలు, యువత పాల్గొన్నారు.

# విద్యుత్ ప్రమాదంలో మరణించిన కార్మికుడి కుటుంబానికి నష్టపరిహారం



**పెద్దపల్లి, జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో 2025 మే 2న జరిగిన దుర్ఘటనలో, 28వ వార్డుకు చెందిన ఉప్పు శంకర్ ఇంట్లో ప్లంబింగ్ పనులు చేస్తూ గజ్జెల శ్రీనివాస్ (45, కరీంనగర్ చింతకుంట నివాసి) విద్యుత్ షాక్‌కు గురై మరణించారు.ఈ ఘటనలో బాధిత కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ శాఖ తరఫున 500,000/- నష్టపరిహారం అందజేశారు. పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు విద్యుత్ శాఖ అధికారులతో కలిసి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు గడ్డం వైష్ణవి, దివ్య, కనకలక్ష్మికి చెక్కును అందజేశారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడిఈ ఆంజనేయరావు, పెద్దపల్లి టౌన్ ఏయ్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానికులు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో నీలగిరి ఎక్స్‌ప్రెస్, తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్ క్యాలెండర్ల ఆవిష్కరణ







**కరీంనగర్, జనవరి 21 నీలగిరి ఎక్స్‌ప్రెస్,**
కరీంనగర్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో నీలగిరి ఎక్స్‌ప్రెస్, దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్‌తో పాటు తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. స్థానిక వైశ్య సేవా కేంద్రం అధ్యక్షులు చిదుర సురేష్, వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ చైర్మన్ చిటుమల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నీలగిరి ఎక్స్ప్రెస్ దినపత్రిక ప్రజా సమస్యలను నిష్పక్షపాతంగా ప్రజల ముందుకు తీసుకొస్తూ, సామాజిక బాధ్యతతో జర్నలిజం నిర్వహిస్తోందని ప్రశంసించారు. జర్నలిస్టుల ఐక్యతకు, వృత్తి విలువలకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని వారు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో వైశ్య సేవా కేంద్రం డైరెక్టర్లు, వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ డైరెక్టర్లు, నీలగిరి ఎక్స్ప్రెస్ ఉమ్మడి జిల్లా రిపోర్టర్లు, టౌన్ రిపోర్టర్లు, వైశ్య సేవా కేంద్రం సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# తలకొండపల్లిలో పట్టుపురుగుల పరిశోధన కేంద్రం ప్రారంభం







**ఆమనగల్లు, జనవరి 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)** తలకొండపల్లి మండల పరిధిలోని కోరింటకుంట తండా గ్రామపంచాయతీలో పట్టుపురుగుల పరిశోధన సెంటర్ ను బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సెరికల్చర్, హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ భాష హాజరై సెంటర్ ను ప్రారంభించారు. నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల ప్రజలకు 1500 స్ప్రింక్లర్లు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు.

# బీఎంఎస్ ఆర్ఏ జిల్లా కన్వీనర్‌గా రవితేజ ఎన్నిక



**కరీంనగర్,జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) అనుబంధ విభాగమైన భారతీయ మెడికల్ అండ్ సేల్స్ రిప్రెజెంటేటివ్స్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్‌గా బొప్పరాతి రవితేజ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ, మెడికల్ రిప్రెజెంటేటివ్స్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని, తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు.కార్యక్రమంలో బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పప్పుల సురేష్, జిల్లా అధ్యక్షులు పసుల శ్రవణ్, నాయకులు రవి, ప్రవీణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మపురి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**పెద్దపల్లి,జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ధర్మపురి పట్టణంలో సుమారు 263.40 కోట్ల రూపాయల నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మరియు సహచర శాసనసభ్యులతో కలిసి పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ముందుగా ధర్మపురి పుణ్యక్షేత్రం లక్ష్మినరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ రావు, జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, డీసీసీ అధ్యక్షులు గాజంగి నందయ్యతో పాటు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నాసిక్ లో రైతు కమిషన్ బృందం రెండో రోజు పర్యటన

**నాసిక్,జనవరి 21 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణ రైతు కమిషన్ బృందం నాసిక్‌లో రెండో రోజు పర్యటన కొనసాగించింది. పలు వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి, రైతులతో నేరుగా మాట్లాడి పంటల సాగు విధానం, ఖర్చులు, మార్కెటింగ్, లాభనష్టాలపై వివరాలు తెలుసుకున్నారు.సాయంత్రం సహ్యాద్రి ఫార్మ్స్ ఎండీ విలాస్ షిండేతో కమిషన్ సభ్యులు సమావేశమయ్యారు. సహ్యాద్రి క్యాంపస్‌లో దాదాపు రెండు గంటలపాటు సాగిన చర్చల్లో కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ, తెలంగాణలో గోదావరి, కృష్ణ నదులతో పాటు గొలుసుకట్టు చెరువులు ఉండటం, సారవంతమైన భూములు, అనుకూల వాతావరణం కారణంగా అన్ని రకాల పంటల సాగుకు అనువైన పరిస్థితులు ఉన్నాయని వివరించారు.రైతు బిడ్డగా వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పాన్ని విలాస్ షిండేకు తెలియజేశారు. ఇటీవల జరిగిన గ్లోబల్ సమ్మిట్ విజన్2047లో వ్యవసాయ రంగానికి ఇచ్చిన ప్రాధాన్యతను గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామికవేత్తలకు రెడ్ కార్పెట్ వేస్తోందని, ఆ దిశగా సీఎం ప్రస్తుతం దావోస్‌లో ఉన్నారని తెలిపారు.బలమైన ఎఫ్పీవోలు ఏర్పాటు కావాలని, దానికోసం



సహ్యాద్రి వంటి సంస్థలు తెలంగాణకు రావాలని కోదండరెడ్డి కోరగా, విలాస్ షిండే సానుకూలంగా స్పందించారు.కమిషన్ సభ్యులు రాములు నాయక్, కేవీఎన్ రెడ్డి మాట్లాడుతూ, దేశంలో పంజాబ్ తర్వాత రైతు సంక్షేమ కమిషన్ ఉన్న రాష్ట్రం తెలంగాణ అని, రైతుల సమస్యల పరిష్కారానికి చైర్మన్ కోదండరెడ్డి అనుభవం ఉపయోగపడుతోందని పేర్కొన్నారు. ములుగు, గద్వాల్ జిల్లాల్లో విత్తనోత్పత్తి చేసి నష్టపోయిన రైతులకు కమిషన్ చొరవతో నష్టపరిహారం అందించిన విషయాన్ని గుర్తుచేశారు.రాంరెడ్డి గోపాల్ రెడ్డి, భవానీ రెడ్డి కూడా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, మార్కెటింగ్ విధానం, పెట్టుబడి, పంటల మార్పిడి వంటి అంశాలపై చర్చించారు.కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి నేతృత్వంలో సాగిన ఈ పర్యటనలో సభ్యులు రాములు నాయక్, కేవీఎన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, భవానీ రెడ్డి, మెంబర్ సెక్రటరీ గోపాల్, అధికారులు సంధ్యారాణి, హరి, స్రవంతి, రజిత, అలాగే ఎఫ్పీవో ప్రతినిధులు ఉపేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్.సి.సి క్యాడెట్‌లకు ప్రశంసా పత్రాలు అందజేసిన కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం.

**కరీంనగర్, జనవరి 21: (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలు మరియు ఎన్నికల సమయంలో ట్రాఫిక్ విధుల్లో అత్యంత సమర్థవంతంగా, క్రమశిక్షణతో విధులు నిర్వహించిన ఎన్.సి.సి క్యాడెట్‌ల సేవలను గుర్తించి, వారిని కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం అభినందించారు. బుధవారం కమీషనరేట్ కేంద్రంలోని అస్త్ర కన్వెన్షన్ హాలునందు ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో క్యాడెట్‌లకు ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఎన్నికల వంటి కీలక సమయాల్లో పోలీసు శాఖకు అండగా నిలిచి, శాంతిభద్రతల పరిరక్షణలో ఎన్‌సిసి క్యాడెట్లు కీలక పాత్ర పోషించారని కొనియాడారు. వారిలోని సేవా దృక్పథం, సమయపాలన అభినందనీయమని పేర్కొన్నారు. క్యాడెట్‌లను సమన్వయం చేస్తూ పోలీసు శాఖకు పూర్తి సహకారాన్ని అందించిన ఎన్‌సిసి అధికారులను సీపీ శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.




రాబోయే మున్సిపల్ ఎన్నికలు, నగరంలో ట్రాఫిక్ నియంత్రణ మరియు శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా భవిష్యత్తులో కూడా ఎన్‌సిసి క్యాడెట్ల సేవలను వినియోగించుకుంటామని సీపీ వెల్లడించారు. సమాజ సేవలో యువత భాగస్వామ్యం కావడం వల్ల వారికి బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగే అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపిలు వెంకటరమణ, భీంరావు, కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ కృష్ణ, సుబేదార్ మేజర్ సాగర్ సింగ్, మేజర్ రవీంద్ర బాబు ఇతర పోలీస్ అధికారులు మరియు ఎన్‌సిసి ప్రతినిధులు పాల్గొన్నారు.

# గన్నేరువరం జెడ్పి హై స్కూల్‌లో స్పెషల్ ఆఫీసర్ ఆకస్మిక తనిఖీ



**గన్నేరువరం,జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గన్నేరువరం మండలంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌ను స్పెషల్ ఆఫీసర్ రామానుజాచార్యులు, జిల్లా కో-ఆపరేటివ్ ఆఫీసర్, కరీంనగర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా విటమిన్ గార్డెన్, కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు, టాయిలెట్స్, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. అనంతరం 10వ తరగతి విద్యార్థుల తరగతిని సందర్శించి వారిని ప్రశ్నించి, రాబోయే పరీక్షల్లో 100% ఫలితాలను సాధించాలని సూచనలు ఇచ్చారు.కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి ఎంపీడీఓ, జి. ప్రణిత్ కుమార్ డీటీ, ప్రధానోపాధ్యాయులు కే. రామయ్యతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య నిర్వహణను ప్రశంసించిన రాజస్థాన్ బృందం



**గంగాధర,జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లాలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ తీరును రాజస్థాన్ అధికారుల బృందం పరిశీలించి ప్రశంసించింది.రామడుగు మండలం వెలిచాల గ్రామాన్ని సందర్శించిన బృందం అధికారులు, ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరిస్తున్న విధానాన్ని, గ్రామస్తులు తడిపొడి చెత్తను వేరుగా ఉంచి పారిశుద్ధ్య వాహనాలకు అందజేస్తున్న విధానాన్ని, సేకరించిన చెత్తతో ఎరువుల తయారీ ప్రక్రియను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.తరువాత కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడేను కలిసిన బృందం, పారిశుద్ధ్య నిర్వహణ, కార్మికుల సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణ చర్యలపై వివరాలు తెలుసుకుంది. మల్టీపర్పస్ వర్కర్లకు, పారిశుద్ధ్య కార్మికులకు అందజేస్తున్న రక్షణ కవచాలు, బీమా సౌకర్యాలపై కూడా చర్చ జరిగింది.రాజస్థాన్ బృందంలో స్వచ్ఛభారత్ మిషన్ డైరెక్టర్ సాలోని కెంకా, గంగానగర్ జెడ్పీ సీఈవో గిరిధర్, బర్మార్ జెడ్పీ సీఈవో రవికుమార్, ఎస్‌బిఎం బ్యాంక్ డైరెక్టర్ మురళి లాల్ శర్మ, ఈఈ రాజేష్ కుమార్ ఉన్నారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ శ్రీధర్, రూరల్ వాటర్ సప్లై, పంచాయతీరాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## గన్నేరువరం మండల ఉపసర్పంచుల ఫోరం చైర్మన్‌గా వంగల లక్ష్మారెడ్డి



**గన్నేరువరం,జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గన్నేరువరం మండల ఉపసర్పంచుల ఫోరం చైర్మన్‌గా గుండ్లపల్లి గ్రామ ఉపసర్పంచ్ వంగల లక్ష్మారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
బుధవారం ఎల్‌ఎం డీ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఉపసర్పంచుల సమావేశంలో మండలంలోని 11 గ్రామ పంచాయతీలలో 10 గ్రామాల ఉపసర్పంచులు పాల్గొని వంగల లక్ష్మారెడ్డిని చైర్మన్‌గా ఎన్నుకున్నారు.ఈ సమావేశంలో వి. జ్యోతి (గుండ్లపల్లి), జి. ప్రవళిక (చీమలకుంటపల్లి), శ్రీనివాసరెడ్డి (పీచుపల్లి), బి. శంకర్ (గోపాల్‌పూర్), కే. అనిత (మాదాపూర్), జి. భాగ్యలక్ష్మి (యాస్వాడ), కె. సంపత్ (చాకలివానిపల్లె), ఐలయ్య (కాసింపేట్), లక్ష్మారెడ్డి (గుండ్లపల్లి), ప్రభాకర్ (జంగపల్లి) పాల్గొన్నారు.తరువాత వీరంతా మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉపసర్పంచుల ఫోరం చైర్మన్ వంగల లక్ష్మారెడ్డి తోపాటు ఉపసర్పంచులను సన్మానించారు.

## ఇంచార్జి మంత్రి తుమ్మల ఆధ్వర్యంలో కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ నేతల సమావేశం



**కరీంనగర్ జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల సమావేశం జరిగింది.ఈ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సిరిసిల్ల డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, ఆది శ్రీనివాస్, కరీంనగర్‌సిద్దిపేటసిరిసిల్ల జిల్లాల గ్రంథాలయ సంస్థ చైర్మన్‌లు సత్తు మల్లేష్, లింగమూర్తి, నాగుల సత్యనారాయణ గౌడ్, సూడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్ కుమార్, నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు, హుజురాబాద్ ఇంచార్జి ఒడితల ప్రణవ్, సిరిసిల్ల ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి, ఆర్టీఏ సభ్యులు పడాల రాహుల్, సంగీతం శ్రీనాథ్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యమని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ నేతలకు దిశానిర్దేశం చేశారు.కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్, సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి, హుస్నాబాద్, హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీలలో పార్టీ సమావేశాలు ఏర్పాటు చేసి, నేతల మధ్య సమన్వయం, ప్రభుత్వ పథకాలను ఇంటింటా ప్రజల్లోకి తీసుకెళ్లే విధానంపై చర్చించారు.

## వాగేశ్వరి, జ్యోతిష్మతి విద్యాసంస్థలపై విచారణకు డిమాండ్



**కరీంనగర్ జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వాగేశ్వరి, జ్యోతిష్మతి విద్యాసంస్థలపై ప్రత్యేక అధికారిని నియమించి విచారణ జరపాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్, తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణలు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టా రెడ్డికి ఫిర్యాదు చేశారు.కాలేజీల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ ఉన్నప్పటికీ విద్యార్థులను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తూ, బలవంతంగా లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. విచారణ పూర్తయ్యాకే ప్రభుత్వ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఫిర్యాదులో కాలేజీల్లో మౌలిక సదుపాయాలు లేవని, యాజమాన్యం అవినీతికి పాల్పడుతోందని పేర్కొన్నారు. వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.చైర్మన్ బాలకిష్టా రెడ్డి సానుకూలంగా స్పందించి విచారణ అధికారి నియమించి దర్యాప్తు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని కుతాడి శివరాజ్ హెచ్చరించారు.

# బిజెపి జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఎన్నిక పై పార్టీ శ్రేణుల సంబరాలు

**కరీంనగర్,జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ అయిన భారతీయ జనతా పార్టీలో సామాన్య కార్యకర్తగా ప్రారంభించి, అతి చిన్న వయసులోనే జాతీయ అధ్యక్ష పదవి దక్కించుకున్న నితిన్ నబీన్ అరుదైన గౌరవాన్ని పొందారని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు.హుజురాబాద్ బిజెపి శాఖ ఆధ్వర్యంలో ఆయన నియామకాన్ని పురస్కరించుకొని భారీ వాహన ర్యాలీతో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, 45 ఏళ్ల వయసులోనే పార్టీ చరిత్రలో అతి చిన్న వయస్కుడిగా జాతీయ అధ్యక్ష బాధ్యతలు చేపట్టడం యువ నాయకత్వానికి గుర్తింపుగా భావిస్తున్నామని తెలిపారు.1980 మే 23న పాట్నాలో జన్మించిన నితిన్ నబీన్, చిన్న వయసులోనే బీహార్ శాసనసభకు ఎన్నికై ఐదుసార్లు ఎమ్మెల్యేగా, అలాగే బీహార్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన విషయాన్ని గుర్తుచేశారు. పార్టీ కోసం ఆయన చేసిన విశేష సేవలు, వివిధ హోదాల్లో



పనిచేసిన అనుభవం కారణంగానే జాతీయ అధ్యక్ష పదవి దక్కిందని అన్నారు.ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా, నితిన్ గడ్కరీ వంటి అగ్ర నేతలు ఆయనను సన్మానించడం సామాన్య కార్యకర్తకు దక్కిన అరుదైన గౌరవమని పేర్కొన్నారు.నితిన్ నబీన్ మార్గనిర్దేశనలో త్వరలో జరగబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేస్తామని గంగాడి కృష్ణారెడ్డి ధీమా వ్యక్తం చేశారు.కార్యక్రమంలో మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ ఎర్రం మహేష్, పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు, మాజీ ఫ్లోర్ లీడర్ పైళ్ల వెంకట్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు గంగిశెట్టి ప్రభాకర్, తూముల శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ మెంబర్ రావుల వేణు, మాజీ పట్టణ అధ్యక్షులు గంగిశెట్టి రాజు, మాజీ కౌన్సిలర్ నల్ల సుమన్, యాంసాని శశిధర్, పట్టణ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.అలాగే సీనియర్ నాయకులు కొలిపాక శ్రీనివాస్, నరాల రాజశేఖర్, తిప్ప బత్తిని రాజు, యాల సంజీవరెడ్డి, సబ్బని రమేష్, అంకటి వాసు, కొలిపాక వెంకటేష్, జిల్లా పదాధికారులు, బూత్ అధ్యక్షులు తదితరులు హాజరయ్యారు.

# సరిహద్దులో కాల్పులకు తెగబడ్డ పాక్..

**జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దాయాది దేశం పాకిస్తాన్.. భారత సరిహద్దులో కాల్పులకు పాల్పడింది. మంగళవారం రాత్రి పాక్ దళాలు.. భారత సరిహద్దుపైకి రెండు రౌండ్ల కాల్పులు జరిపాయి. వెంటనే అప్రమత్తమైన భారత దళాలు కూడా ఎదురు కాల్పులకు దిగడంతో పాక్ తోక ముడిచింది. ఈ ఘటన కాశ్మీర్ ప్రాంతం, కుప్వారా జిల్లా, కేరన్ సెక్టార్లో జరిగింది.ఈ సరిహద్దు ప్రాంతంలో భద్రతను మరింత పెంచేందుకు 6 రాష్ట్రీయ రైఫిల్స్ కు చెందిన సిబ్బంది రాత్రిపూట హై టెక్నాలజీ సీసీ కెమెరాల్ని ఏర్పాటు చేస్తున్నారు. శత్రువులు చొచ్చుకొచ్చే వీలున్న కొన్ని బ్లైండ్ స్పాట్స్ లో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. దీనికి సంబంధించి సామగ్రి తరలించి, వాటిని అమరుస్తుండగా పాక్ సైన్యం తేలికపాటి ఆయుధాలతో రెండు రౌండ్ల కాల్పులు జరిపింది. సీసీ కెమెరాలు అమర్చే పనుల్ని అడ్డుకునే ఉద్దేశంతో పాక్ ఈ పని చేసినట్లు తెలుస్తోంది.



అయితే, వెంటనే భారత భద్రతా బలగాలు ధీటుగా స్పందించాయి. పాక్ వైపు సింగిల్ షాట్స్ కాల్పులకు దిగింది మన సైన్యం. దీంతో పాకిస్తాన్ ఆర్మీ ఆగిపోయింది. కాగా.. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి హానీ కలగలేదని రక్షణ అధికారులు తెలిపారు. మరోవైపు ఇది చాలా దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో ఈ ప్రాంతంలో సైన్యం కార్డన్ సెర్చ్ ఆపరేషన్ చేస్తోంది ఇండియన్ ఆర్మీ. మన సైన్యం దృష్టి మళ్లించేందుకే పాక్ ఈ కాల్పులు జరిపిందా అనే అనుమానంతో ముందు జాగ్రత్త చర్యగా ఈ ప్రాంతాన్ని సైన్యం పూర్తిగా గాలిస్తోంది. పైగా.. రాబోయే రిపబ్లిక్ డేను దృష్టిలో ఉంచుకుని భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

# హసీనాపై దేశద్రోహం కేసులో ఫిబ్రవరి 9న విచారణ

**ఢాకా : – జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పదవీచ్యుత ప్రధాని షేకహేసీనాపై దాఖలైన దేశద్రోహం కేసులో మరో విచారణను ఫిబ్రవరి 9న నిర్వహిస్తామని బంగ్లాదేశ్‌కోర్టు బుధవారం ప్రకటించింది. ఢాకా స్పెషల్ జడ్జి కోర్ట్ –9 జస్టిస్ ఎం.డి.అబ్దుస్ సలాం ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు మీడియా తెలిపింది. ఈ అంశంపై వేర్వేరు అభ్యర్థలను పరిశీలించిన అనంతరం జడ్జి ఈ నిర్ణయం ప్రకటించినట్లు పేర్కొంది. 286మంది నిందితుల్లో, పదవీచ్యుత ప్రధాని షేక్ హసీనాతో సహా 259మంది ఇప్పటికే పరారీలో ఉన్నారని, వారిపై విచారణ జరుగుతోంది. హసీనా సహ పరారీలో ఉన్న నిందితులందరూ కోర్టు ఎదుట హాజరుకావాల్సిందిగా వార్తాపత్రికలో నోటీసులు ముద్రించాల్సిందిగా కోర్టు గతేడాది అక్టోబర్ 14న ఆదేశించింది. స్థానిక మీడియా అందించిన వివరాల ప్రకారం.. .. 2024 డిసెంబర్ 19న 'జాయ్ బంగ్లా బ్రిగేడ్' నిర్వహించిన వర్చువల్ సమావేశంలో హసీనా మరియు పలువురు అవామీ లీగ్ సభ్యులు పాల్గొన్నారు. యుఎస్ అవామీలీగ్ నేత డా.రబ్బీ ఆలం నిర్వహించిన ఈ ఆన్‌లైన్ సమావేశంలో హసీనాను తిరిగి ప్రధానిగా నియమించేందుకు అంతర్యుద్ధం చేస్తామని ప్రతిజ్ఞ చేశారని పేర్కొంది. బంగ్లాదేశ్ మరియు విదేశాల నుండి మొత్తం 577మంది వ్యక్తులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో




వారు ముహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు కుట్రపన్నారని పేర్కొన్నారు. హసీనా ఆదేశాలను పాటిస్తామని హామీ ఇచ్చారని తెలిపింది.సిఐడి ఎఎస్‌పి మొహమ్మద్ ఎనాముల్ హక్ గతేడాది మార్చిలో హసీనా మరియు 72మందిపై కోర్టులో దేశద్రోహం కేసు నమోదు చేశారు. ఆగస్టు 14న హసీనా సహా 286మందిపై చార్జిషీటు సమర్పించారు. కోర్టు చార్జిషీటును స్వీకరించి, నిందితులందరికీ అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది.
విద్యార్థుల నేతృత్వంలోని నిరసనలపై ప్రభుత్వం క్రూరమైన అణచివేత చర్యలకు పాల్పడినందుకు నవంబర్‌లో ప్రత్యేక ట్రిబ్యునల్ హసీనాకు మరణశిక్ష విధించిన సంగతి తెలిసిందే.

# జార్ఖండ్‌లో ఎమర్జెన్సీ

### ఏనుగు బీభత్సం.. 22 మంది మృతి..

**రాంచీ – జనవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జార్ఖండ్ లో ఓ ఏనుగు బీభత్సం సృష్టించింది. సుమారు 22 మందిని చంపింది. రోజుకు 30 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తోంది. గుంపు నుంచి వేరుపడిన ఆ ఏనుగు మహాభీకరంగా ప్రవర్తిస్తోంది. పశ్చిమ సింగభుమ్ జిల్లాలో ఆ ఏనుగు బీభత్సం సృష్టిస్తోంది. దీంతో జార్ఖండ్ ప్రభుత్వం ఎమర్జెన్సీ



ప్రకటించింది. ఆ జంతువును పట్టుకునేందుకు అటవీశాఖ 100 మందిని రంగంలోకి దింపింది. మూడుసార్లు ఆ ఏనుగుకు మత్తు మందు ఇచ్చే ప్రయత్నం చేశారు. కానీ దాన్ని అదుపు చేయలేకపోయారు. బహుశా ఆ ఏనుదు మదంతో ప్రవర్తించి ఉంటుందని భావిస్తున్నారు. టెస్టెస్టరోన్ లెవల్స్ పెరగడం వల్ల ఆ ఏనుగు ప్రమాదకరంగా మారినట్లు కూడా అంచనా వేస్తున్నారు. మొదటిసారి ఓ మగ ఏనుగు ఈ స్థాయి బీభత్సం సృష్టించి ఉంటుందని ఫారెస్ట్ ఆఫీసర్ కుల్దీప్ మీనా తెలిపారు.

